

ఐదుగుళ్లపల్లిలో మావోయిస్టు నేత కార్తీక్‌దాదా సోదరుడి నివాసం

• మావోయిస్టు నేత కార్తీక్ దాదా

ఐదుగుళ్లపల్లి వాసే!

11న ఒడిస్సా ఎన్‌కౌంటర్‌లో మరణించిన కార్తీక్‌దాదా అలియాస్ పృథ్వి మోహనరావు

- 30 ఏళ్ల కిందట స్వగ్రామం కృష్ణాజిల్లా గూడూరు మండలం ఐదుగుళ్లపల్లికి రాక
- బెంగుళూరులో నివాసం ఉంటున్న ఆయన భార్య, కుమార్తె

మచిలీపట్నం/గూడూరు, డిసెంబరు15(ఆంధ్రజ్యోతి) : ఒడిస్సా రాష్ట్రం నారాయణ్‌పూర్ జిల్లా కుమ్మంలోని లక్‌వేద వద్ద ఈ నెల 11వ తేదీన జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించిన మావోయిస్టు నేత కార్తీక్ దాదా అలియాస్ పృథ్వి మోహనరావు(65) కృష్ణాజిల్లా గూడూరు మండలం ఐదుగుళ్లపల్లి గ్రామానికి చెందిన వారే. ఆయన ఒడిస్సా మావోయిస్ట్ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా పనిచేస్తున్నారు. వృద్ధాప్యంలో ఉన్న ఆయన వేరొకరి సహాయం లేకుండా నడవలేని స్థితిలో ఉన్నారు. అటువంటి స్థితిలో ఉన్న ఆయన్ను, ఆయనకు సహాయకురాలిగా ఉన్న రమీలాను పోలీసులు పట్టుకుని బూటకపు ఎన్‌కౌంటర్ చేసినట్లు కమ్యూనిస్టులు ఆరోపించారు.

మోహనరావు నేపథ్యం ఇలా..

గూడూరు మండలంలోని ఐదుగుళ్లపల్లి, పోలవరం, కప్పలదొడ్డి గ్రామాల్లో కమ్యునిస్టులు అధికంగా ఉంటారు. కమ్యునిస్టు భావజాలాన్ని ఔపాసన పట్టిన పృథ్వి మోహనరావు మావోయిస్టు ఉద్యమంలోకి వెళ్లి దీర్ఘకాలంపాటు పనిచేశారు. ఆయన ఐదుగుళ్లపల్లిలో ఐదో తరగతి వరకు చదువుకున్నారు. 6, 7 తరగతులు పోలవరం ప్రాథమికోన్నత పాఠశాలలో, 8 నుంచి 10వ తరగతి వరకు మల్లవోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదివారు. గుంటూరు జిల్లా నల్లపాడులో పాలిటెక్నిక్ కోర్సు చదివిన ఆయన, కొంతకాలంపాటు గుంటూరులో ఆర్‌అండ్‌బీ విభాగంలో సూపర్‌వైజర్ పనిచేశారు. అక్కడి నుంచి మావోయిస్టులలో చేరి అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. 1986లో తన సోదరుడు యోగానాందరావు వివాహం సమయంలో ఒకసారి, 30 సంవత్సరాల కిందట రెండు సార్లు ఐదుగుళ్లపల్లికి వచ్చారు. తనకు ఇల్లు, ఇతరత్రా ఆస్తులు ఏమీ అవసరం లేదని, తల్లిదండ్రులను జాగ్రత్తగా చూసుకోమని సోదరులకు బాధ్యతలు అప్పగించి వెళ్లిపోయారు. ఆయన భార్య జ్యోతి అలియాస్ పద్మ ప్రస్తుతం బెంగళూరులో ఉంటున్నారు. ఉద్యమంలో ఉండగానే జ్యోతిని ఆయన వివాహం చేసుకున్నారు. కుమార్తె భారతిని ఐదు సంవత్సరాల పాటు తన తల్లిదండ్రుల వద్ద ఐదుగుళ్లపల్లిలోనే ఉంచారు. అనంతరం బంధువులు మోహనరావు కుమార్తెను తమతో తీసుకువెళ్లారు. కొంతకాలం తర్వాత ఉద్యమం నుంచి బయటకు వచ్చిన మోహనరావు భార్య జ్యోతి తన కుమార్తెతో సహా బెంగళూరు వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. గత 30 సంవత్సరాలుగా మోహనరావుకు ఐదుగుళ్లపల్లితో సంబంధాలు తెగిపోయాయి. ఆయన భార్య ఎప్పుడో ఒకసారి ఐదుగుళ్లపల్లికి వచ్చేవారు. ఆమె ఆరోగ్యం బాగుండకపోవడంతో కొన్ని సంవత్సరాలుగా ఆమె ఇక్కడకు రాలేదని బంధువులు చెబుతున్నారు.

మృతదేహం కోసం కుమార్తె అభ్యర్థన

ఎన్‌కౌంటర్‌లో మరణించిన మోహనరావు మృతదేహాన్ని తమకు ఇవ్వాలని, గ్రామంలో అంత్యక్రియలు నిర్వహిస్తామని ఆయన కుమార్తె భారతి పోలీస్ అధికారులకు లేఖ రాసినట్లు మోహనరావు సోదరుడు యోగానందరావు తెలిపారు.

30 ఏళ్లుగా రాలేదు



నా సోదరుడు మోహనరావు ఐదుగుళ్లపల్లికి 30 ఏళ్లుగా రాలేదు. ఆయన ఎన్‌కౌంటర్‌లో మరణించారని శనివారం రాత్రి పొద్దుపోయాక మా కుమార్తె భారతి ద్వారా తెలిసింది. ఇక్కడే పదో తరగతి వరకు చదుకున్న మోహనరావును పాలిటెక్నిక్ చదివేందుకు నా తల్లిదండ్రులు గుంటూరుకు పంపారు. 1986లో నా వివాహానికి వచ్చారు. ఆ తర్వాత రెండు సార్లు ఐదుగుళ్లపల్లికి వచ్చి వెళ్లారు. మళ్లీ 30 ఏళ్లగా కనిపించలేదు. ఐదునెలల కిందట ఎన్ఐఏ అధికారులు మా ఇంటికి వచ్చి ఇల్లంతా సోదాచేశారు. మోహరావు ఇక్కడకు వస్తే తెలియజేయాలని చెప్పి వారు వెళ్లిపోయారు.

- యోగానందరావు, కార్తీక్‌దాదా సోదరుడు, ఐదుగుళ్లపల్లి

అవినీతి, అక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా మాజీ మంత్రి కొడాలి నాని మరోమారు నిలిచారు. గుడివాడ మండలం లింగవరంలో భారీ లేఅవుట్ ముసుగులో అటు అధికారులను, ఇటు ప్లాట్ల కొనుగోలుదారులను వంచించారు. 25 ఎకరాల లేఅవుట్లో పంచాయతీకి రిజర్వు స్థలం ఇవ్వకుండా మోసం చేశారు. ఐదెకరాల స్థలం పాఠశాలలకు కేటాయించినట్లు చూపి 2.5 ఎకరాల్లో దర్జాగా కళ్యాణ మండపం నిర్మించుకున్నారు. మరో 2.5 ఎకరాలు స్వాధీనంలో పెట్టుకున్నారు. ప్లాట్లు కొనుగోలు చేసిన లబ్దిదారులు అక్కడ ఇళ్లు నిర్మించుకోకుండా 22ఏలో పెట్టించి కుట్రలు చేస్తూ వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారు. నాని భూ మాయను చూసి ముక్కున వేలేసుకొంటున్నారు.

- ఆంధ్రజ్యోతి - గుడివాడ





పాఠశాలకు కేటాయించిన స్థలంలో నిర్మించిన కె కన్వెన్షన్ భవనం

భూ మాయ!

2011లో లింగవరంలో 25.44 ఎకరాల విస్తీర్ణంలో లేఅవుట్ ఏర్పాటు

- గ్రామ పంచాయతీకి రిజర్వు చేయాల్సిన పదిశాతం స్థలం ఆక్రమణ
- 2.5 ఎకరాల్లో కళ్యాణ మండపం నిర్మాణం • దీని విలువ రూ.7.5 కోట్లుపైనే..
- మరో రెండున్నర ఎకరాలు కబ్జా.. గతంలో క్యాసినో నిర్వహణ
- నేటికీ లేఅవుట్‌కు అనుమతి ఇవ్వని గ్రామ పంచాయతీ అధికారులు
- మంత్రిగా ఉన్న సమయంలో ఈ భూములు 22ఎ జాబితాలో చేరిక
- ఇళ్లు కట్టుకోవడానికి అవకాశం లేక ప్లాట్ల కొనుగోలుదారుల అవస్థలు

2011లో లేఅవుట్ ఏర్పాటు

గుడివాడ మండలం లింగవరం గ్రామ పంచాయతీ ఏరియాలో 2011లో మాజీ మంత్రి కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) తనతో పాటు మరికొందరు స్థానికుల పేర్లతో సర్వే నంబర్లు 239/1బి, 2, 240/1బి, 3, 244/1, 2ఎ, 2బి, 3, 4, 5, 245/1, 2, 3, 246, 247/1, 2, 3లలో 25.44 ఎకరాల విస్తీర్ణంలో లేఅవుట్ వేశారు. స్థానిక లైసెన్స్‌డ్ సర్వేయర్‌తో లేఅవుట్ మ్యాప్‌ను తయారు చేయించి గ్రామ పంచాయతీకి సమర్పించారు. లేఅవుట్‌లో 10శాతం స్థలాన్ని పంచాయతీకి కేటాయించాల్సి ఉంది. అదే క్రమంలో లేఅవుట్ మ్యాప్‌లో చూపాల్సి ఉంది. అధికారం చేతిలో ఉండటంతో పాఠశాల స్థలంగా చూపి సర్వేయర్‌తో లేఅవుట్‌ను సిద్ధం చేయించారు. నిబంధనలకు వ్యతిరేకంగా ఉండటంతో అనుమతులిచ్చేందుకు పంచాయతీ అధికారులు నిరాకరించినట్టు సమాచారం. పంచాయతీలో సమర్పించిన అనధికార లేఅవుట్‌కు అనుమతి నిరాకరిస్తూ నేటికీ పంచాయతీ అధికారి సంతకం చేయకపోవడం విశేషం.



లేఅవుట్ లోపలికి ఎవరూ రాకుండా గేటుకు వేసిన తాళం

ఐదెకరాలను పాఠశాల స్థలంగా చూపి..

లేఅవుట్‌లో లింగవరం పంచాయతీకి రిజర్వు స్థలాన్ని ఇవ్వాల్సి ఉంది. కానీ లేఅవుట్‌లో ఐదు ఎకరాల విస్తీర్ణంలో రెండు స్థలాలను పాఠశాల సైట్‌లుగా చూపారు. దీనిలో రెండున్నర ఎకరాల విస్తీర్ణంలో కె కన్వెన్షన్ పేరుతో భారీ కళ్యాణ మండపాన్ని నిర్మించారు. దీనికి కూడా పంచాయతీ నుంచి ఎటువంటి అనుమతులు పొందలేదని, ఇది అక్రమ కట్టడమని అధికారులు పేర్కొంటున్నారు. పక్కనే చూపిన మరో స్థలంలోనే 2020 సంక్రాంతికి నాని భారీ స్థాయిలో క్యాసినో నిర్వహించినట్లు వైసీపీ నాయకులే బహిరంగంగా చెబుతున్నారు. రిజర్వు స్థలాన్ని చూపకపోవడం, కనీసం దాని స్థానంలో వేరే చోట ఎక్కడా కూడా స్థలాన్ని అప్పగించలేదని పంచాయతీ అధికారులు పేర్కొంటున్నారు.



పంచాయతీకి సమర్పించిన మ్యాప్

ఐదేళ్ల పాటు పంచాయతీకి పన్ను నిల్

కె కన్వెన్షన్ కళ్యాణ మండపం నిర్మించిన నాటి నుంచి ఐదేళ్ల పాటు పంచాయతీకి ఎటువంటి పన్ను చెల్లించలేదు. 2020లో క్యాసినో నిర్వహణ తర్వాత భవిష్యత్ భద్రతా దళం వ్యవస్థాపకులు యలమంచిలి మురళీకృష్ణ పంచాయతీ అధికారులను వివరాలు అడగడంతో అప్పటి మంత్రి నానిలో చలనం వచ్చింది. గుట్టుచప్పుడు కాకుండా కళ్యాణ మండపానికి పన్ను వేయించి ఆనాటి నుంచి చెల్లిస్తున్నట్లు సమాచారం. ఎవరు రాకుండా బారికేడ్లు.. దారులన్నీ మూసివేత 25 ఎకరాలు అనధికార లేఅవుట్ కావడం, అధికారం కోల్పోవడంతో సదరు లేఅవుట్‌లోకి ఎవరు రాకుండా కొడాలి నాని ముందస్తుగా పటిష్ట భద్రత ఏర్పాట్లు చేసుకున్నారు. ప్రధాన రహదారి నుంచి లోపలికి వెళ్లే అంతర్గత రహదారులను మూసి వేశారు. కొన్ని చోట్ల ఏర్పాటు చేసిన గేట్‌లకు తాళాలు వేశారు. లింగవరం గ్రామం వైపుగా బారికేడ్లు పెట్టి మూసేసారు.

నాలా కూడా చెల్లించలేదు!

వ్యవసాయ భూమిని వ్యవసాయేతర అవసరాలకు వినియోగించాలంటే తప్పనిసరిగా ప్రభుత్వం నిర్దేశించిన మొత్తాన్ని నాలా పన్నుగా చెల్లించాలి. ఎమ్మెల్యేగా తనకున్న అధికారాన్ని అడ్డుపెట్టుకుని కొడాలి నాని రెవెన్యూ శాఖకు చెల్లించాల్సిన మొత్తం చెల్లించలేదని తెలిసింది. దీనిపై రెవెన్యూ అధికారులు సైతం మిన్నుకుండిపోవడం విశేషం.

వీధి లైట్ల బిల్లు పంచాయతీదే!

25 ఎకరాల లేఅవుట్‌లో లింగవరం పంచాయతీ నిధులతో విద్యుత్ స్తంభాలు, వీధిలైట్లు ఏర్పాటు చేశారు. వీధి లైట్లకు వచ్చే బిల్లును సైతం పంచాయతీ నిధుల నుంచి చెల్లిస్తున్నట్లు సమాచారం.

ఆందోళనలో ప్లాట్ల కొనుగోలుదారులు

కొడాలి నాని లేఅవుట్‌లోని దాదాపుగా 100 ప్లాట్‌లు కొనుగోలు చేసిన వారు ఆందోళన చెందుతున్నారు. అమ్మిన ప్లాట్‌లను స్వాధీనపరిచారు గానీ వాటిలో ఎటువంటి లావాదేవీలు నిర్వహించకుండా అడ్డుకుంటున్నారని వాపోతున్నారు. ఆ స్థలాల్లో ఎడ్ల పందేలు, కోడి పందేలు, పేకాట నిర్వహిస్తున్నట్లు ఆరోపిస్తున్నారు. మంత్రిగా ఉన్న సమయంలో సదరు సర్వే నంబర్‌లను నిషేధిత జాబితా 22ఎలో చేర్చడంతో ఇల్లు నిర్మించుకుందామన్నా వీలు పడటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొడాలి నాని చేసిన మోసంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్లాట్ల కొనుగోలుదారులు మందపాటి గోపాలస్వామి, మలిరెడ్డి దేవారెడ్డి, మేడేపల్లి జ్ఞానేసు తదితరులు తమ ప్లాట్లు 22ఎ నిషేధిత జాబితాలో ఉన్నట్లు పేర్కొన్నారు.

పంచాయతీ రోడ్డును ఆక్రమించుకుని..

జీ.పి.కె రహదారి నుంచి లేఅవుట్ గుండా ఊర్లోకి వెళ్లే 40 అడుగుల పంచాయతీ రోడ్డును దర్జాగా కబ్జా చేశారు. రోడ్డుకు ఇరువైపుల బారికేడ్లు ఏర్పాటు చేసుకుని లోపలికి ఎవరు రాకుండా చేశారు.

స్థలం చూసుకోనివ్వకుండా అడ్డుకున్నారు

లింగవరంలోని కొడాలి నాని లేఅవుట్‌లో 400 గజాల స్థలాన్ని కొనుగోలు చేశాను. నేటికీ స్థలం ఎక్కడా ఉందో చూపించలేదు. పలు మార్లు సర్వేయర్‌లకు స్థలం కొలతల నిమిత్తం అర్జీ పెట్టుకున్నా అధికారులు స్పందించలేదు. కనీసం లేఅవుట్‌లోకి వెళ్లి స్థలం చూసుకునే హక్కు కూడా లేకుండా నాని అనుచరులు అడ్డుకునేవారు. ఇటీవల ఆరా తీయగా సదరు లేఅవుట్‌లోని సర్వే నంబర్లు అన్నింటినీ నిషేధిత జాబితాలో చేర్చి ఉన్నట్లు అధికారులు తెలిపారు.

- మేడేపల్లి జ్ఞానేసు, శేరీదింటక్రురు, గుడివాడ మండలం

కేంద్రానికి మెట్రో

ప్రతిపాదనలు పంపిన రాష్ట్ర ప్రభుత్వం



బెజవాడ మెట్రో రైలు ప్రాజెక్టు ప్రతిపాదన కేంద్రానికి చేరింది. మొదటి ఫేజ్‌లో బెజవాడ, రెండో ఫేజ్‌లో అమరావతిలను అనుసంధానం చేస్తూ ప్రతిపాదించిన మెట్రో డీపీఆర్‌కు ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. నూరుశాతం ఖర్చును కేంద్రమే భరించనున్న ఈ ప్రాజెక్టు మరో మూడు నెలల్లో పట్టాలెక్కనుంది. పనులు కూడా వేగంగా పూర్తి చేసేలా సంబంధిత అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

మరో మూడు నెలల్లో పట్టాలెక్కనున్న ప్రాజెక్టు

- మొదటి దశలో ఏలూరు, బందరు రోడ్డు కారిడార్లు
- శరవేగంగా పనులు చేపట్టే నిర్మాణ సంస్థలపై అధ్యయనం
- మెట్రో స్టేషన్లు, కోచ్ డిపోల కోసం పాత ప్రతిపాదనలోనే భూముల సేకరణ
- విజయవాడ ఎయిర్‌పోర్టు దగ్గర అండర్ గ్రౌండ్ మెట్రో పనులు
- నిడమానూరు నుంచి రామవరప్పాడు వరకు డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : మెట్రో డీపీఆర్‌కు రాష్ట్ర ప్రభుత్వం పచ్చ జెండా ఊపడంతో రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు దీనికి సంబంధించిన సమగ్ర డీపీఆర్‌ను కేంద్ర ప్రభుత్వానికి పంపించారు. ఈ ప్రాజెక్టుకు అయ్యే ఖర్చును నూరు శాతం కేంద్రమే భరించాలని ప్రతిపాదించటంతో దీనిపై రెండు నెలల సమయం తీసుకునే అవకాశం కనిపిస్తోంది. ముందు మౌలికంగా అనుమతులు ఇచ్చి ముందుకు వెళ్లమని నిర్దేశించినా.. డీపీఆర్‌పై ఏమైనా సందేహాలు ఉంటే వాటిని నివృత్తి చేసుకోవటానికి కేంద్రం మార్చి నెల వరకు సమయం తీసుకోవచ్చని తెలుస్తోంది. రాష్ట్ర విభజన నేపథ్యంలో బెజవాడకు మెట్రో ప్రాజెక్టు ప్రతిపాదనను గతంలో కేంద్ర ప్రభుత్వమే తీసుకు వచ్చింది. రాష్ట్ర విభజన చట్టంలో కూడా బెజవాడ మెట్రోకు పూర్తి సహాయ సహకారాలను అందిస్తామని స్పష్టం చేసింది. గతంలో మెట్రో ప్రాజెక్టుకు కేంద్రం 20 శాతం, రాష్ట్రం 20 శాతం వాటాగా భరించాలని, మిగిలిన 60 శాతం రుణం ద్వారా ప్రాజెక్టును చేపట్టాలన్న విధానంలో కేంద్రం వ్యవహరించింది. ప్రస్తుతం నూరు శాతం కేంద్రం భరించాలని ప్రతిపాదించటం వల్ల అధికారికంగా అనుమతులు ఇవ్వటానికి మూడు నెలల సమయం పట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. పబ్లిక్ ఇన్వెస్ట్‌మెంట్ బోర్డు (పీఐబీ)లో దీనిపై చర్చించిన మీదట తుది అనుమతులు ఇవ్వాల్సి ఉంటుంది.

గత యాక్షన్ ప్లాన్‌కు అనుగుణంగానే ప్రక్రియ

కేంద్రానికి ప్రతిపాదన అందిన నేపథ్యంలో గత టీడీపీ ప్రభుత్వంలో నిర్దేశించుకున్న యాక్షన్ ప్లాన్ ప్రకారమే వెళ్లేందుకు ఏపీఎంఆర్‌సీఎల్ నిర్ణయించింది. మొదటి ఫేజ్‌లో గన్నవరం నుంచి ఏలూరు రోడ్డు మీదుగా పీఎన్‌బీఎస్ వరకు 25.95 కిలోమీటర్లు, అలాగే పెనమలూరు సెంటర్ నుంచి బందరు రోడ్డు మీదుగా పీఎన్‌బీఎస్ వరకు 12.45 కిలోమీటర్ల మేర రెండు కారిడార్లను ఎలివేటెడ్ విధానంలో చేపట్టవలసి ఉంది. ఈ రెండు కారిడార్లకు సంబంధించి 30కి పైగా మెట్రో స్టేషన్లను నిర్మించేందుకు భూముల అవసరం ఉంది. కోచ్ డిపో నిర్మాణానికి భూములు కావాల్సి ఉంది. మెట్రో ప్రధాన స్టేషన్‌ను పీఎన్‌బీఎస్ దగ్గర ఏర్పాటు చేస్తారు. వీటన్నింటికీ కలిపి భూములను గతంలో నిర్దేశించుకున్న ప్లాన్ ప్రకారమే సేకరించాల్సి ఉంటుంది. సీఆర్‌డీఏ, జిల్లా యంత్రాంగం, ట్రాఫిక్ పోలీసులు, కార్పొరేషన్ తదితర ప్రభుత్వ శాఖల భాగస్వామ్యంతో చేపట్టాల్సిన కార్యక్రమాలను ముందుకు తీసుకువెళ్లటానికి గతంలో నియమించిన కమిటీతోనే ప్రస్తుతం కూడా పనిచేయాలని ఏపీఎంఆర్‌సీఎల్ భావిస్తోంది.

పనులు వేగంగా చేసే సంస్థల కోసం జల్లెడ

కేంద్ర ప్రభుత్వం మౌలికంగా అనుమతులు ఇచ్చినా.. అధికారికంగా అనుమతులు ఇచ్చినా కూడా శరవేగంగా క్షేత్ర స్థాయిలో పనులు చేపట్టడానికి ఔత్సాహిక కాంట్రాక్టు సంస్థలతో కూడా సంప్రదింపులు జరపాలని భావిస్తోంది. రికార్డు స్థాయిలో ఫ్లైఓవర్ల నిర్మాణాలను పూర్తి చేసిన సంస్థలు, అత్యున్నత ప్రమాణాలతో ఫ్లై ఓవర్లను నిర్మించిన సంస్థలను కూడా భాగస్వామ్యం చేయాలన్న ఆలోచన చేస్తోంది. ప్రపంచంలో కానీ, దేశీయంగా కానీ , స్థానికంగా కానీ అలాంటి సంస్థలు ఏమున్నాయన్న దానిపై ఏపీఎంఆర్‌సీఎల్ అధ్యయనం చేస్తోంది.

ఎయిర్‌పోర్టు దగ్గర అండర్ గ్రౌండ్ మెట్రో

గన్నవరం నుంచి పీఎన్‌బీఎస్‌కు ప్రతిపాదించిన ఏలూరు రోడ్డు కారిడార్ విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయానికి అనుసంధానమవుతుంది. విమానాశ్రయానికి అనుసంధాన మయ్యే కారిడార్‌ను పూర్తిగా అండర్ గ్రౌండ్ విధానంలో నిర్మించాలని ఏపీఎంఆర్‌సీఎల్ నిర్ణయించింది. ఎయిర్‌పోర్టు దగ్గరలోని యోగాశ్రమం వద్ద ఒక మెట్రో స్టేషన్‌ను నిర్మిస్తారు. సరిగ్గా ఈ మెట్రో స్టేషన్ నుంచి అండర్ గ్రౌండ్ మెట్రో ఎయిర్‌పోర్టుకు అనుసంధానమవుతుంది. విమానాశ్రయంలో నిర్మిస్తున్న నూతన ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ బిల్డింగ్‌కు ఏకబిగువున అండర్ గ్రౌండ్ మెట్రో అనుసంధానమవుతుంది. విమానాశ్రయం మిగతా 6లో..

దుర్గమ్మపై ప్రత్యేక డాక్యుమెంటరీ

- 21 నుంచి జరగనున్న దీక్షల విరమణలో ఆవిష్కరణ!
- సిద్ధం చేసిన హైదరాబాద్‌కు చెందిన అదిరాజ్ సినీ క్రియేషన్స్



డాక్యుమెంటరీని పరిశీలిస్తున్న ఈవో రామారావు, అదిరాజ్ సినీ క్రియేషన్ నిర్వాహకురాలు కార్తీక

వన్‌టౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న కనకదుర్గమ్మ వైభవాన్ని విశ్వవ్యాప్తం చేసేందుకు శ్రీదుర్గామల్లేశ్వర దేవస్థానం సరికొత్తగా ఓ డాక్యుమెంటరీని రూపొందించింది. భవానీ దీక్షల విరమణ సమయంలో ఆవిష్కరించటానికి సన్నాహాలు చేస్తోంది. ఇంద్రకీలాద్రిపై స్వయంభువుగా వెలసిన కనకదుర్గమ్మను 8వ శతాబ్దంలో ఆది శంకరాచార్యులు దర్శించుకున్నారు. మహిషాసురమర్దినిగా ఉగ్ర రూపంలో ఉన్న అమ్మవారిని ఆయన తన ధ్యానం ద్వారా ప్రసన్నం చేసుకున్నారు. ఆమె ఉగ్రరూపాన్ని తగ్గించి భక్తులకు సుందర మనోహరమైన కుసుమ కోమల రూపంలో చిరుమందహాసంతో దర్శనం ఇవ్వాలని వేడుకున్నారు. ఆమె అనుగ్రహించటంతో కళాపకర్షణ ప్రక్రియ ద్వారా అమ్మవారి ఉగ్రరూపాన్ని ఆది శంకరాచార్యుల వారు తొలగింపజేసి, సర్వాకర్షణగా సకల శుభాలను ఇచ్చేదిగా ఉండే అమ్మవారి రూపాన్ని రూపొందించారు. కాగా, పూర్వ కాలం నుంచి కనకదుర్గమ్మ లీలలను గురించి అనేక మంది పలు రచనలు చేశారు. ఇటీవల ఈవో కె.ఎస్.రామారావు దుర్గమ్మ వైభవాన్ని మరింతగా ప్రాచుర్యంలోకి తెచ్చేందుకు కొన్ని గ్రంథాలను ప్రచురించారు. ఇదే క్రమంలో తాజాగా డాక్యుమెంటరీని కూడా రూపొందించారు. ఈ డాక్యుమెంటరీలో ఆలయంలో నిత్యం అమ్మవారికి జరిగే సేవలు, పూజలు, ఉత్సవాలు, దీక్షలు తదితరాలు ఎన్నింటినో సంక్షిప్తం చేశారు. 30 నిమిషాలు నిడివి గల ఈ డాక్యుమెంటరీని హైదరాబాద్‌కు చెందిన అదిరాజ్ సినీ క్రియేషన్స్ రూపొందించింది. డాక్యుమెంటరీ తుది మెరుగులు దిద్దుకుంటుంది. ఈ నెల 21 నుంచి ప్రారంభమయ్యే భవానీ దీక్షల విరమణ మొదటి రోజు దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, కమిషనర్ ఎస్.సత్యనారాయణ సమక్షంలో ఈ డాక్యుమెంటరీని ఆవిష్కరించనున్నట్లు ఈవో రామారావు, అదిరాజ్ సినీ క్రియేషన్ నిర్వాహకురాలు కార్తీక తెలిపారు.

విజయవాడ ఈస్ట్ బైపాస్‌కు మార్చిలో టెండర్లు

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : విజయవాడ ఈస్ట్ బైపాస్ రోడ్డుకు మార్చిలో జాతీయ రహదారుల సంస్థ టెండర్లు పిలవనుంది. ఈస్ట్ బైపాస్‌కు సంబంధించి చైతన్య కన్సల్టెన్సీ ఇచ్చిన మూడు ఆప్షన్లలో రెండో ఆప్షన్ వైపే రాష్ట్ర ప్రభుత్వం తాజాగా మొగ్గుచూపింది. ఆప్షన్- 2కు సంబంధించి సానుకూలంగా నిర్ణయం తీసుకోవాల్సిందిగా కేంద్రానికి కూడా నివేదించింది. దీంతో కేంద్ర ప్రభుత్వం కూడా ఆప్షన్ - 2కే సానుకూలంగా ఉన్నట్టు తెలుస్తోంది. ఈ ఆప్షన్ - 2లో భాగంగా కృష్ణా బ్రిడ్జి ఎక్కడ వస్తుంది? క్లోవర్ లీఫ్ జంక్షన్ ఎక్కడ ప్రతిపాదిస్తారన్న దానిపై స్పష్టత రావాల్సి ఉంది. ఆప్షన్ - 2కు 291.06 హెక్టార్ల భూమి సేకరించాల్సి ఉంది. నిర్మాణ ఖర్చు రూ.1,873 కోట్లుగా ఉంది. ఆప్షన్ - 1, 3 కంటే కూడా ఆప్షన్ - 2కు ఎక్కువ ఖర్చు అవుతుంది. కేంద్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టుపై సానుకూలంగా ఉండటంతో పాటు నిధుల సర్దుబాటు అంశాలపై దృష్టి పెట్టినట్టుగా తెలుస్తోంది. ఆర్థిక సంవత్సరం ఆఖరు నాటికి నిధుల వ్యవహారం కొలిక్కి తెచ్చి టెండర్లకు శ్రీకారం చుట్టనున్నట్టు సమాచారం.

కొండంత భక్తితో..



» మార్గశిరాన కనకదుర్గమ్మ గిరి ప్రదక్షిణ



వన్‌టౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో గిరిప్రదక్షిణ కార్యక్రమం ఆదివారం అత్యంత వైభవంగా సాగింది. అలంకరించిన వాహనం పై వేదికను అమర్చి గంగా, పార్వతీ మల్లేశ్వరుల ఉత్సవ విగ్రహాలను ప్రతిష్ఠించి స్థానాచార్యుడు శివప్రసాద్ శర్మ, ముఖ్య అర్చకుడు ఆర్.శ్రీనివాసశాస్త్రిలు లఘుపూజలు నిర్వహించారు. ఈవో కె.ఎస్.రామరావు, తదితరులు కొబ్బరికాయలు కొట్టి ప్రదక్షిణను ప్రారంభించారు. మార్కాపురం, వినుకొండ, గిద్దలూరు ప్రాంతాల నుంచి నాట్యాభినయాన్ని నేర్చుకుంటున్న చిన్నారులు ఊరేగింపులో పాల్గొన్నారు. అమ్మవారికి చిన్నారులు నాట్యనీరాజనంతో చూపరులను ఆనందింపచేశారు. కోలాటాలు, నృత్యాలు, మంగళవాయిద్యాలు, తప్పెట వాయిద్యాల కలబోతతో సుమారు కిలోమీటరు పొడవున భక్తరంజకంగా గిరిప్రదక్షణ సాగింది. మరోవైపు దేవస్థానం రూపొందించిన జయదుర్గా కీర్తనలు భక్త జనాలను తన్మయింపజేశాయి. గిరిప్రదక్షిణలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కుమ్మరిపాలెం సెంటర్, నాలుగు స్తంభాల సెంటర్, సితార సెంటర్, కబేళా సెంటర్, సీవీఆర్ బ్రిడ్జి, పాలఫ్యాక్టరీ, చిట్టినగర్, కొత్తపేట, బ్రాహ్మణవీధి, రథం సెంటర్ మీదుగా ప్రదక్షిణ సాగింది. భక్తులకు అమ్మవారి ప్రసాదంగా పాయసాన్ని పంపిణీ చేశారు. మిల్క్ ఫ్యాక్టరీ ఆధ్వర్యంలో భక్తులకు వేడి బాదం పాలను పంపిణీ చేశారు.

గజ వాహనంపై శ్రీవారు..



గుడ్లవల్లేరు, డిసెంబరు, 15 (ఆంధ్రజ్యోతి) : డోకిపర్రులో వేంచేసిన భూసమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో సాలకట్ల బ్రహ్మోత్సవాలు మూడోరోజున అత్యంత వైభవంగా జరిగాయి. ఆదివారం ఉదయం శుప్రభాత సేవ, తోమాల సేవ, అర్చన కైంకర్యాల అనంతరం వేంకటేశ్వర స్వామిని, శ్రీభూదేవి సమేతంగా గజ వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. స్వామివార్లకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం రథోత్సవం కన్నుల పండుగగా నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆలయ నిర్వాహకులు పి.వీరారెడ్డి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ సేవలో సినీనటి జయప్రద, శ్యామలాదేవి

వన్‌టౌన్ : రాజ్యసభ మాజీ సభ్యురాలు, సీనియర్ నటి జయప్రద, మాజీ కేంద్రమంత్రి సీనియర్ నటుడు కృష్ణంరాజు సతీమణి శ్యామలాదేవిలు ఇంద్రకీలాద్రిపై ఆదివారం కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. దర్శనం అనంతరం వారికి ఈవో కేఎస్ రామారావు అమ్మవారి శేషవస్త్రం, చిత్రపటం, ప్రసాదం అందజేశారు.



సినీనటి జయప్రద, కృష్ణంరాజు సతీమణి శ్యామలాదేవిలకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో రామారావు



భక్తులతో కిటకిటలాడుతున్న ఆలయ ప్రాంగణం

ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ

వన్‌టౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వర దేవస్థానంలో ఆదివారం భక్తుల రద్దీ ఏర్పడింది. వివిధ ప్రాంతాల నుంచి అమ్మవారి దర్శనం కోసం వేకువజాము నుంచే భక్తులు బారులుతీరారు. పలువురు భక్తులు ఆర్జిత సేవల్లో పాల్గొన్నారు. ఆదివారం సందర్భంగా సూర్యోపాసన సేవ నిర్వహించారు. సూర్యనారాయణ మూర్తి చిత్రపటానికి శోడశోపచార పూజలు నిర్వహించి, అర్చనాది కార్యక్రమాలను పూర్తిచేసి మంత్రపుష్పం, హారతి, ఆశీస్సులు అందచేశారు. దుర్గగుడి గిరి ప్రదక్షణలో ఆదివారం ఉదయం పాల్గొన్న చిన్నారులు కళావేదికపై తమ అభినయాన్ని ప్రదర్శించారు. 100 మంది బాలికలు ఒకే ఆహార్యంతో తమదైన శైలిలో ప్రదర్శన ఇచ్చారు. వారిని ఈవో అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు.

నేడు రామినేని కోటయ్యార్యుల విగ్రహావిష్కరణ



ఆవిష్కరణకు సిద్ధమైన విగ్రహం

తోట్లవల్లూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఆధ్యాత్మిక గురువు, స్వాతంత్ర్య సమరయోధుడు రామినేని కోటయ్యార్యుల విగ్రహావిష్కరణ విజ్ఞాన ఆశ్రమంలో సోమవారం ఉదయం నిర్వహించనున్నట్టు ఆయన కుటుంబీకులు తెలిపారు. గరికపర్రులో 1888లో జన్మించిన రామినేని కోటాయ్యార్యులు దామెర్ల వెంకటాచార్యుల వద్ద శిష్యరికం చేసి ఈ ప్రాంతంలో ఆధ్యాత్మిక గురువుగా పేరు గాంచారు. గరికపర్రులో విజ్ఞాన ఆశ్రమం పీఠాధిపతిగా కోటయ్యార్యులు ఉండేవారు. ఆయన 1934లో తనువుచాలించారు. విజ్ఞాన ఆశ్రమం శిథిలావస్థకు చేరటంతో మనువళ్లు రామినేని బాలకోటేశ్వరరావు, రామకోటేశ్వరరావు, కుమారులు విజ్ఞాన శతాబ్ది ఉత్సవం నిర్వహిస్తున్నారు. శిథిలమైన ఆశ్రమాన్ని ఆధునీకరించి రామినేని కోటయ్యార్యుల విగ్రహావిష్కరణ చేయనున్నట్టు తెలిపారు.



దర్యాప్తు ముమ్మరం చేసిన పోలీసులు

బాలిక మిస్సింగ్.. విచారణ వేగం



దివ్య (ఫైల్)

అవనిగడ్డ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : అవనిగడ్డ లంకమ్మ మాన్యం సమీపంలో కాలువ గట్టు పక్కన నివశిస్తున్న బాలిక శనివారం మధ్యాహ్నం నుంచి కనిపించకపోవటం ఈ ప్రాంతంలో తీవ్ర కలకలం రేకెత్తించింది. అవనిగడ్డకు చెందిన ఆవుల గోపి-కొండాలమ్మల కుమార్తె ఆవుల దివ్య (3) శనివారం మధ్యాహ్నం తల్లి కొనిచ్చిన బిస్కెట్ ప్యాకెట్లు తీసుకుని ఆడుకోవటానికి వెళ్లి అదృశ్యమైంది. దీనిపై బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అవనిగడ్డ డీఎస్పీ మురళీధర్ నేతృత్వంలో విచారణ నిర్వహించిన సీఐ యువకుమార్, ఎస్ఐ శ్రీనివాసరావులు అవనిగడ్డలోని అన్ని సీసీ ఫుటేజీలు పరిశీలించారు. ఎలాంటి ఆధారం లభించకపోవటంతో బాలిక ఆడుకుంటున్న ప్రదేశాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ క్రమంలో బిస్కెట్ ప్యాకెట్లు కాలువ గట్టున కనిపించటంతో బాలిక ప్రమాదవశాత్తు కాలువలో పడిపోయిందా? లేక ఎవరైనా తీసుకెళ్లిపోయారా? అన్న కోణంలో దర్యాప్తు ముమ్మరం చేశారు.

ఎస్పీ ఆదేశాలతో కదిలిన యంత్రాంగం

బాలిక మిస్సింగ్ ఘటనపై జిల్లా ఎస్పీ గంగాధర్‌రావు ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేయాలని ఆదేశించారు. ఏఎస్పీలు వీవీ నాయుడు, సత్యనారాయణలు ఆదివారం ఉదయం బృందాలతో బాలిక తప్పిపోయిన ప్రాంతాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. అవనిగడ్డ నుంచి నాగాయలంక వరకు 10 కిలోమీటర్ల పొడవునా పంట కాలువలో గాలింపు చేపట్టారు. అయినా రాత్రి వరకు ఎలాంటి పురోగతి కనిపించలేదు. గాలింపు చర్యలు కొనసాగిస్తామని డీఎస్పీ మురళీధర్ తెలిపారు. బాలిక ఆచూకి తెలియకపోవడంతో ఆమె తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు.

అమ్మానుషం!

» నడి రోడ్డుపై వృద్ధురాలిని వదిలేసిన కుటుంబీకులు

» వృద్ధాశ్రమంలో చేర్చిన పోలీసులు



వృద్ధాశ్రమంలో లక్ష్మీకాంతం

గన్నవరం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : నడవలేని స్థితిలో ఉన్న వృద్ధురాలిని నడిరోడ్డుపై వదిలివేసి వెళ్లిపోయి మానవత్వాన్ని మంటగలిపారు. గన్నవరం శివారులోని ఆల్ఫా హోటల్ సమీపంలో శనివారం అర్ధరాత్రి కారులో తీసుకువచ్చి నిర్మానుష్య ప్రాంతంలో వదిలివేసి వెళ్లారు. సుమారు 85ఏళ్ల ఉన్న వృద్ధురాలు మంచులోనే చలికి గజగజ వణికిపోయింది. స్థానికుల సమాచారం మేరకు గన్నవరం పోలీసులు వృద్ధురాలి వద్దకు చేరుకుని ఆమెను వివరాలు అడగ్గా మాట్లాడలేని పరిస్థితిలో ఉంది. వారు సీఐ శివ ప్రసాద్‌కు సమాచారం ఇవ్వగా టీకేఆర్ వృద్ధాశ్రమం నిర్వాహకులతో మాట్లాడి వృద్ధురాలిని అక్కడ చేర్చారు. ఆమె వద్ద ఉన్న ఆధార్ కార్డు ఆధారంగా కొండపావులూరు గ్రామానికి చెందిన నక్కా లక్ష్మీకాంతంగా గుర్తించారు. వృద్ధురాలి బంధువులను పిలిపించి మాట్లాడే ప్రయత్నాలను పోలీసులు చేస్తున్నారు.

ఆంధ్రుడికి ఆద్యుడు.. అమరజీవి

» ఘనంగా పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ దినం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు నారాయణ, అచ్చెన్నాయుడు, పార్థసారథి, ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యేలు యార్లగడ్డ, బొండా ఉమా

విజయవాడ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రులకు ఒక గుర్తింపు తెచ్చి.. తెలుగు వారంటే పోరాటయోధులని నిరూపించి.. స్వరాష్ట్రం, స్వపరిపాలన కోసం తమిళులతో తగువ పెట్టుకుని.. ప్రాణాలకు తెగించి ఆంధ్రరాష్ట్రాన్ని సాధించారు అమరజీవి పొట్టి శ్రీరాములు. ఆయన వర్ధంతిని పొట్టిశ్రీరాములు ఆత్మార్పణదినంగా ప్రభుత్వం ప్రకటించింది. ఈ కార్యక్రమాన్ని విజయవాడలోని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆయన జీవిత ఘట్టాలను పుస్తక రూపంలో ఆవిష్కరించారు. కార్యక్రమానికి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. మంత్రి పి.నారాయణ, అచ్చెన్నాయుడు, కలెక్టర్ లక్ష్మీశ, ఎమ్మెల్యేలు యార్లగడ్డ వెంకటరావు, శ్రీరాం తాతయ్య, ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ డూండీ రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

బలిదానంతోనే రాష్ట్రం వచ్చింది

- బొండా ఉమా, సెంట్రల్ ఎమ్మెల్యే

పొట్టి శ్రీరాములు ఆత్మార్పణకు స్ఫూర్తిగా భావితరాలను తయారు చేయాలి. ఆయన ఆత్మబలిదానం చేయకపోతే మనకు రాష్ట్రం ఉండేది కాదు. మనం ఇంకా మదరాసీలుగా ఉండేవాళ్లం. పొరుగున ఉన్న తెలంగాణ వివిధ కారణాల రీత్యా విడిపోయిన స్వర్ణాంధ్రప్రదేశ్ కోసం లక్ష్యాలను సీఎం చంద్రబాబు నిర్దేశించారు. పొట్టి శ్రీరాములుకు ఉన్న పట్టుదలతో చంద్రబాబుతో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తారు.

ఆరంభ శూరత్వం నానుడిని తొలగించారు

- కేశినేని చిన్ని, విజయవాడ ఎంపీ

భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు అమరజీవి కారణం. ఆంధ్రులు ఆరంభ శూరత్వం అనుకునే ధోరణిని పొట్టి శ్రీరాములు మార్చారు. ఆయన స్ఫూర్తిని కొనసాగించాలి. చంద్రబాబు విజన్ డాక్యుమెంట్‌తో పిల్లల భవిష్యత్తు స్వర్ణయుగంగా ఉంటుంది.

గొప్ప సామాజికవేత్త

- కె.పార్థసారథి, సమాచార మంత్రి

అమరజీవి పొట్టి శ్రీరాములు గొప్ప సామాజిక వేత్త. స్వాతంత్రానికి ముందు హరిజనోద్ధరణ ఉద్యమం చేశారు. దళితులకు దేవాలయాల్లో ప్రవేశం కల్పించాలని పోరాటం చేశారు. ఆయన పోరాట ఫలితంగా మద్రాసు ప్రెసిడెన్సీలో అనేక ఉత్తర్వులు వచ్చాయి. రాజ్యాంగం, చట్టాలను గౌరవించి పాలన సాగించే ప్రభుత్వాలు అధికారంలో ఉండాలి. స్వార్థంతో కూడిన నేతలు అధికారంలో ఉంటే వారికి మాత్రమే లాభం. ప్రజలకు ఏమాత్రం ఉపయోగం ఉండదు. చంద్రబాబు విజన్ భావితరాల భవిష్యత్తుకు ఎంతో ఉపయోగం.

ఎయిర్‌పోర్టుకు ఆర్టీసీ ఏసీ బస్సు!

» ఐదేళ్ల తర్వాత పునఃప్రారంభం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయానికి ఆర్టీసీ అధికారులు ఏసీ బస్సును నడిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్లుగా విమానాశ్రయానికి నిలిచిపోయిన ఆర్టీసీ బస్సును తిరిగి పునరుద్ధరించాలని ఆర్టీసీ అధికారులు నిర్ణయించారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో విజయవాడ విమానాశ్రయం అనూహ్య వృద్ధిని నమోదు చేసింది. అమరావతి రాజధాని కార్యకలాపాల నేపథ్యంలో, విమానాశ్రయానికి రాకపోకలు పెరిగాయి. ఈ నేపథ్యంలో గత టీడీపీ ప్రభుత్వంలో విమాన ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ అధికారులు ఏసీ బస్సును నడిపారు. గత ఐదేళ్లపాటు విమానాల సంఖ్య తగ్గటం, బస్సు ప్రయాణికుల సంఖ్య తక్కువగా ఉండటంతో ఆర్టీసీ అధికారులు సర్వీసును నిలిపివేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో మళ్లీ విమానయానం పుంజుకుంది. దేశీయంగా, అంతర్జాతీయంగానూ సర్వీసులు పెరిగాయి. దీంతో విమాన ప్రయాణికులు బస్సును పునరుద్ధరించాల్సిందిగా అభ్యర్థిస్తున్న నేపథ్యంలో ఆర్టీసీ అధికారులు మెట్రో ఏసీ బస్సును నడపాలని నిర్ణయించారు. ఆర్ఎం ఎంవై దానం 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ ఎయిర్‌పోర్టు అధికారుల నుంచి ఫ్లైట్స్ షెడ్యూల్ తీసుకుని దానికి అనుగుణంగా బస్సులు తిప్పేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

నకిలీ ఎరువుల గుట్టు రట్టు

» 70 సంచుల గుళికలు, ప్యాకింగ్ మిషన్, జనరేటర్ స్వాధీనం



అధికారులు స్వాధీనం చేసుకున్న ఎరువుల బస్తాలు

విస్సన్నపేట, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తెల్లదేవరపల్లి గ్రామంలోని మామిడి తోటలో అనధికారికంగా నిర్వహిస్తున్న ఎరువుల ప్యాకింగ్ కేంద్రం గుట్టును శనివారం రాత్రి వ్యవసాయశాఖ అధికారులు రట్టు చేశారు. గత కొంతకాలంగా తెల్లదేవరపల్లి పరిసర ప్రాంతాల్లో ఎరువులు ప్యాకింగ్ చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఏవో రాజ్యలక్ష్మి ఆదివారం విలేకర్లకు వివరాలు వెల్లడించారు. తెల్లదేవరపల్లి గ్రామంలో శనివారం రాత్రి ఓ మామిడి తోటలో నిర్వహిస్తున్న అనధికార ఎరువులు ప్యాకింగ్‌ను గ్రామానికి చెందిన రైతులు గుర్తించి సంఘటనా స్థలానికి వెళ్లి కేకలు వేయగా ఎరువులు ప్యాకింగ్ చేస్తున్న వ్యక్తులు బొలెరో వాహనంలో పరారయ్యారు. రైతుల ఫిర్యాదు మేరకు ఆ ప్రాంతాన్ని తనిఖీ చేసినట్టు ఏవో రాజ్యలక్ష్మి చెప్పారు. డీఏపీగా ప్రింట్ చేసిన ఖాళీ బస్తాల్లో తక్కువ రేటు గల సూపర్ గుళికలు పోసి ప్యాక్ చేస్తున్నారని, అక్కడ ఉన్న జనరేటర్, సంచులకు సీలు వేసి మిషన్, ఎరువుల బస్తాలను స్థానిక ఎస్ఆర్‌కే సెంటర్‌కు తరలించినట్టు చెప్పారు. ఎరువులను పరీక్షా కేంద్రానికి పంపుతున్నామని, నిర్వాహకులపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్టు తెలిపారు. నకిలీ ఎరువులు తయారు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు.

ప్రశ్నించటం అలవాటు చేసుకోవాలి

» ప్రజలకు సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు సుంకర పుణ్యవతి పిలుపు

» చల్లపల్లిలో జిల్లా 25వ మహాసభలు ప్రారంభం



ప్రసంగిస్తున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు సుంకర పుణ్యవతి, చిత్రంలో నరసింహారావు, హరిబాబు



అమరస్థూపం వద్ద నివాళులు

చల్లపల్లి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు ప్రశ్నించటం అలవాటుచేసుకోవాలని, ప్రభుత్వాలను ప్రశ్నించాలని లేకుంటే కసాయిచేతిలో గొర్రె తల మాదిరి ఉండాల్సి వస్తుందని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు సుంకర పుణ్యవతి అన్నారు. పార్టీ కృష్ణాజిల్లా 25వ మహాసభలు ఆదివారం చల్లపల్లిలో ప్రారంభమయ్యాయి. స్థానిక ఏటీఎం సెంటరులో బహిరంగ సభలో పుణ్యవతి మాట్లాడుతూ, రానున్న రోజుల్లో ప్రజల మద్ధతుతో బలమైన ప్రజా ఉద్యమాలకు సన్నద్ధం అవుతామన్నారు. దివితాలూకాలో ప్రతి గ్రామానికీ చరిత్ర ఉందన్నారు. హరికథ, బుర్రకథల ద్వారా ఉద్యమాల చరిత్ర నేటికీ చెప్పుకోవాల్సిందేనన్నారు. కేంద్ర ప్రభుత్వం అంబానీ, అదానీలను మేపుతోందని ఆమె విమర్శించారు. నల్లచట్టాల రద్దుకోసం కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తే జగన్, చంద్రబాబులు నోరు విప్పలేదన్నారు. దేశంలో రోజుకి 86 మందిపై అత్యాచారాలు జరుగుతున్నాయనీ, దేశంలో మహిళలకు రక్షణ ఎక్కడుందన్నారు. ఆర్టీసీ ప్రయాణం, మహిళలకు ప్రతి నెలా డబ్బులు అంటూ చంద్రబాబు ఇచ్చిన హామీలు అమలు చేయలేదని ఆమె విమర్శించారు. ప్రజలు ప్రభుత్వాలను ప్రశ్నించాలని సూచించారు. సారా, డ్రగ్స్, గంజాయి, చీప్ లిక్కర్‌కు హద్దే లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు, కౌలురైతు సంఘం జిల్లా నాయకులు ఎం.హరిబాబులు ప్రసంగిస్తూ ప్రజల కోసం సీపీఎం చేసే పోరాటాలకు మద్ధతుగా నిలవాలన్నారు. మండల కార్యదర్శి యద్దనపూడి మధు అధ్యక్షతన జరిగిన సభలో సీపీఎం నేతలు శీలం నారాయణరావు, పల్లం వెంకటేశ్వరరావు, లక్ష్మీప్రసాద్, కె.శివనాగేంద్రం, పి.మోహనరావు, బండి ఆదిశేషు, ఎం.వెంకటేశ్వరరావు, సీపీఐ నేత హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ, సీఐటీయూ నేత మహమ్మద్ కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

ఎరుపెక్కిన చల్లపల్లి!

పోరాటాల పురిటిగడ్డ, చల్లపల్లి జమిందారీ వ్యతిరేక భూ పోరాటాలకు కేంద్ర బిందువైన చల్లపల్లి ఆదివారం ఎరుపెక్కింది. మహాసభల సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి సీపీఎం నేతలు, కార్యకర్తలు, అభిమానులు, అనుబంధ సంఘాల ప్రతినిధులతో చల్లపల్లి ఎర్రతివాచీ కప్పినట్టయింది. అమరస్థూపం నుంచి బహిరంగ సభావేదిక వరకు భారీ ర్యాలీ సాగింది. రామానగరం నుంచి ప్రజా కళాకారుడు బోలెం రామారావు ఎడ్లబండిపై తెచ్చిన ప్రభ విశేషంగా ఆకట్టుకుంది. కళాకారుల పాటలు, పద్యాలు నృత్యరూపకాలు ఆకట్టుకున్నాయి.

కేంద్రానికి మెట్రో..

(5వ పేజీ తరువాయి)

అధికారులకు గతంలో ఇచ్చిన అండర్ గ్రౌండ్ మెట్రో ప్లాన్‌లో ఎలాంటి మార్పు లేదని తెలుస్తోంది. విమానాశ్రయం నుంచి బయటకు వచ్చేటపుడు మళ్లీ రెండో అండర్ గ్రౌండ్ మార్గంలో కేసరపల్లి మెట్రో స్టేషన్‌కు అనుసంధానమవుతుంది.

డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్‌కు అంచనాలు పూర్తి

మెట్రో కారిడార్ వస్తున్న మార్గంలోనే నిడమానూరు జంక్షన్ నుంచి మహానాడు జంక్షన్ వరకు ఎన్‌హెచ్-16పై 6.5 కిలోమీటర్ల ఫ్లై ఓవర్ వస్తున్న సంగతి తెలిసిందే. ఈ ఫ్లై ఓవర్ వల్ల మెట్రో కారిడార్‌కు ఇబ్బందులు లేకుండా ఉండటానికి ఈ ఫ్లై ఓవర్‌ను డబుల్ డెక్కర్‌గా నిర్మించాలని నిర్ణయించారు. కింద రోడ్డు ఆ పైన ఫ్లై ఓవర్, దీనిపై మెట్రో ఎలివేటెడ్ కారిడార్ లైన్ వెళ్లేలా డిజైన్‌కు ఏపీఎంఆర్‌సీఎల్ శ్రీకారం చుట్టింది. దాదాపుగా డిజైన్లు ఖరారయ్యాయి. రూ.1000 కోట్ల వ్యయం అయ్యే అవకాశం కనిపిస్తోంది. నిడమానూరు జంక్షన్ నుంచి రామవరప్పాడు వరకు 4.5 కిలోమీటర్ల మేర మాత్రం డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్ వస్తుంది.



ఓవరాల్ చాంపియన్ కృష్ణా జట్టుకు బహుమతి ప్రదానం

మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్ కృష్ణా

» ముగిసిన రాష్ట్రస్థాయి పోటీలు

గుడివాడ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహిస్తున్న 44వ రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ ఓవరాల్ చాంపియన్‌గా ఆతిథ్య కృష్ణాజిల్లా జట్టు నిలిచింది. రెండు రోజులుగా జరుగుతున్న పోటీలు ఆదివారం ముగిసాయి. పురుషుల విభాగంలో పరుగుపందెం పోటీల్లో విజయనగరం జట్టు, మహిళల విభాగంలో విశాఖపట్నం జట్టు విజేతగా నిలిచాయి. 50ఏళ్ల పైబడి పురుషుల, మహిళల విభాగాల్లో రిలే పరుగుపందెంలో ఆతిథ్య కృష్ణాజిల్లా జట్టు విజేతగా నిలిచింది. 5 కి.మీల వాకింగ్ పురుషుల విభాగంలో డీవీఎస్ బాబురావు, మహిళల విభాగంలో ఎం.జ్యోతిరెడ్డిలు ప్రథమ స్థానంలో నిలిచారు. 1500మీ పరుగుపందెంలో ఎం.ఎస్ రాజు ప్రథమ స్థానం, 50ఏళ్ల మహిళల విభాగంలో కోటేశ్వరమ్మ, 400 మీ విభాగంలో అప్పలస్వామి, మహిళల విభాగంలో వి.లక్ష్మమ్మ, 45ఏళ్ల విభాగంలో హేమర్‌త్రో లో వి.సుబ్బలక్ష్మిలు విజేతలుగా నిలిచారు. 70ఏళ్ల విభాగంలో హ్యామర్ త్రో లో పురుషుల్లో వై.వెంకటేశ్వరరావు, మహిళల విభాగంలో టి.విజయకుమారి, 45ఏళ్ల విభాగంలో డిస్కస్ త్రో.. పురుషుల్లో వీవీఎం కృష్ణారావు ప్రథమ, సురేష్‌బాబు ద్వితీయ స్థానం, మహిళల విభాగంలో కె.మర్రికుండా ప్రథమ, పెంచులమ్మ ద్వితీయ స్థానంలో నిలిచారు. ఓవరాల్ చాంపియన్‌గా ఆతిథ్య కృష్ణాజిల్లా జట్టు నిలిచింది. స్టేడియం కమిటీ సంయుక్త కార్యదర్శి కిలారపు రంగప్రసాద్ విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు గుత్తా చంటి, ఇండియా మాస్టర్స్ అథెటిక్స్ రాష్ట్ర అధ్యక్షులు రాజేంద్రప్రసాద్, ప్రధాన కార్యదర్శి ఎంవీ ప్రసాద్, ఆర్గనైజర్లు అప్పలస్వామి, చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా జూడో పోటీలు

విజయవాడ స్పోర్ట్స్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని కండ్రిక కేఆర్‌వీఆర్ ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ క్లబ్‌లో ఆదివారం ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల జూడో టోర్నమెంట్ ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగాయి. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నేషనల్ ఎస్సీ కమిషన్ ఛైర్‌పర్సన్ కిషోర్ మక్‌వానా హాజరై విజేతలకు పతకాలు అందజేశారు. విజయవాడలో ఈ నెల 24, 25 తేదీల్లో జరగనున్న సీనియర్ స్టేట్ జూడో టోర్నీలో సత్తాచాటాలని ఆకాంక్షించారు. క్రీడాకారులను బీజేపీ రాష్ట్ర మోర్చా అధ్యక్షుడు దేవానంద్ అభినందించారు. ఈ సందర్భంగా ఏపీ జూడో సంఘం సీఈవో నామిశెట్టి వెంకట్, అధ్యక్షుడు గణేశ సుబ్బారావు, ఉపాధ్యక్షుడు గమిడి శ్రీనివాస్, సహాయ కార్యదర్శి ఎస్.పవన్‌సందీప్‌లు పాల్గొన్నారు.

జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీలకు నిఖిల్, ఆషియా

విజయవాడ స్పోర్ట్స్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి) : జమ్మూ కాశ్మీర్‌లో ఈ నెల 18 నుంచి 23 వరకు జరగనున్న జాతీయస్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఉమ్మడి కృష్ణా జిల్లా క్రీడాకారులు బాలుర విభాగంలో ఆర్ నిఖిల్(పాయకాపురం సెయింట్ జోసెఫ్ ఇంగ్లీష్‌మీడియం), బాలికల విభాగంలో షేక్ ఆషియా(విజయవాడ చైతన్య స్కూల్)లు ఎంపికయ్యారని జిల్లా అసోసియేషన్ కార్యదర్శులు గమిడి సాంబశివరావు, గరికపాటి మారుతీలు తెలిపారు.



మాట్లాడుతున్న ఆర్డీ ప్రసాద్, పక్కన క్రీడాసంఘాల ప్రతినిధులు

సీఎంగారూ స్పందించండి!

» ఆడుదాం- ఆంధ్రా అవినీతిపై విచారణ చేపట్టాలి


» ఆత్యా-పాత్యా సీఈవో ఆర్డీ ప్రసాద్ డిమాండ్

విజయవాడస్పోర్ట్స్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వంలో నిర్వహించిన 'ఆడుదాం- ఆంధ్రా' కార్యక్రమం ద్వారా రూ.100 కోట్ల మేర అవినీతి, అక్రమాలు జరిగాయని ఆధారాలతో సీఐడీ అధికారులకు ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు అతీగతీ లేదని, ఈ విషయంలో సీఎం చంద్రబాబు చొరవ తీసుకుని నిజ నిర్ధారణకు ఆదేశాలివ్వాలని జాతీయ కబడ్డీ మాజీ క్రీడాకారుడు, ఆత్యా-పాత్యా సీఈవో ఆర్డీ ప్రసాద్ డిమాండ్ చేశారు. ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అప్పటి మంత్రి రోజా, శాప్ ఛైర్మన్ సిద్దార్థరెడ్డిలు కుంభకోణంలో ప్రధాన సూత్రధారులని, వీరికి నలుగురు శాప్ అధికారులు కొమ్ముకాసి కోట్లలో అవినీతికి సహకరించారని ఆరోపించారు. దీనిపై సీఐడీ అధికారులకు ఆర్నెల్ల క్రితం ఫిర్యాదు చేసినట్టు చెప్పారు. భారీ అవినీతిపై సీఐడీ విచారణలో ఒక్కరోజు తనను విజయవాడ పోలీసులు విచారించి తర్వాత మిన్నకుండిపోయారని, ఈ విషయంలో క్రీడా మంత్రి, సీఎం స్పందించి అవినీతి పరుల ఆటకట్టించాలని, లేకుంటే హైకోర్టును ఆశ్రయిస్తానన్నారు. సమావేశంలో వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు జోసెఫ్, అప్పలస్వామి, ఎం.శివ, కృష్ణారెడ్డి, ప్రసాద్‌లు పాల్గొన్నారు.

రేపు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గన్నవరం రాక

గన్నవరం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మంగళవారం గన్నవరం విమానాశ్రయానికి రానున్నారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాట్లు చేపట్టారు. 17న ఢిల్లీలో బయలుదేరి గన్నవరం విమానాశ్రయానికి 11.30 వచ్చి ఇక్కడి నుంచి రోడ్డు మార్గాన మంగళగిరి ఎయిమ్స్‌కు వెళతారు. ఎయిమ్స్ తొలి స్నాతకోత్సవంలో పాల్గొని తిరిగి విమానాశ్రయానికి చేరుకుని హైదరాబాద్ వెళ్లనున్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	112, 120, 131
చికెన్ విత్ స్కిన్	210
చికెన్ స్కిన్‌లెస్	220

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.630

రహదారుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం

మొగల్రాజపురం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రహదారులను అభివృద్ధితోపాటు విస్తరించి ప్రజలకు సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణాలను అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని), ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. తూర్పు నియోజకవర్గంలోని టవర్‌లైను రోడ్డు విస్తరణ పనులపై స్థల యజమానులు, పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు, ట్రాఫిక్ పోలీసులతో ఆదివారం ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సంక్రాంతి నాటికి రాష్ట్రంలో ప్రధాన రహదారులు, అంతర్గత రహదారులపై గోతులు లేకుండా చేయాలని నిధులు విడుదల చేశారన్నారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ బందరు రోడ్డు విస్తరణ మీద కూడా అధికారులు దృష్టి పెట్టాలన్నారు.



కొయ్యూరులో అవగాహన సదస్సు నిర్వహిస్తున్న ఎక్సైజ్ పోలీస్ సిబ్బంది

మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై అవగాహన

హనుమాన్‌జంక్షన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలు, నాటు సారాకు యువత దూరంగా ఉండాలని గన్నవరం ఎక్సైజ్ ఎస్సై చందా అల్లూరయ్య తెలిపారు. ఆదివారం ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో బాపులపాడు మండలం కొయ్యూరు, మడిచర్ల గ్రామాల్లో మత్తు పదార్థాలు దుష్ప్రభావాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. నాటు సారా, గంజాయికి దూరంగా ఉండాలని సూచించారు. గంజాయి, నాటుసారా అక్రమంగా నిల్వ పెట్టిన, రవాణా చేస్తున్నట్టు సమాచారం అందించి సహకరించాలని కోరారు. ఎక్సైజ్ పోలీస్ సర్కిల్ కార్యాలయం సిబ్బందితో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.



పచ్చ జెండా ఊపి చలో గుంటూరును ప్రారంభిస్తున్న జేఏసీ నేత కోటేశ్వరరావు

ఎస్సీ వర్గీకరణను సుప్రీం కోర్టు పునఃసమీక్షించాలి

కంకిపాడు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును పునఃసమీక్షించుకోవాలని మాల జేఏసీ నేతలు జల్లి కోటేశ్వరరావు అన్నారు. గుంటూరులో ఆదివారం నిర్వహించిన చలో గుంటూరు కార్యక్రమానికి కంకిపాడు నుంచి భారీగా తరలివెళ్లారు. జల్లి కోటేశ్వరరావు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణతో ఎస్సీల్లోని 56 ఉప కులాలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయన్నారు. బట్టు నాగరాజు, గుదే జయప్రకాష్, తాడితోటి నరసింహారావు పాల్గొన్నారు.

ఉయ్యూరులో రేపు జాబ్‌మేళా

ఉయ్యూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధికల్పన శాఖ, డీఆర్‌డీఏ - సీడాప్, ఎన్ఏసీ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఈనెల 17న ఉయ్యూరులో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా ఉపాధి కల్పన అధికారి డి.విక్టర్‌బాబు, నైపుణ్యాభివృద్ధి అధికారి పి.నరేశ్‌కుమార్ ఆదివారం ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. బస్టాండ్ సమీపాన శ్రీలంక కాలనీలో ఎన్ఏసీ ట్రైనింగ్ సెంటర్ నందు జరిగే జాబ్‌మేళాలో బజాజ్ క్యాపిటల్, మెడ్‌ప్లస్ హెల్త్ సర్వీసెస్, గూగుల్ పే వంటి ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నాయన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఫార్మసీ పూర్తిచేసి 18 నుండి 35 ఏళ్లలోపు వారు అర్హులని, ఎంపికైన వారికి నెలకు సుమారు రూ.12 నుంచి రూ. 20వేల వరకు పని అనుభవాన్ని బట్టి వేతనముతో పాటు ఇతర సౌకర్యాలు ఉంటాయన్నారు.

ఘనంగా దత్తాత్రేయ జయంతి

ఉయ్యూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గండిగుంట శ్రీగణపతి సచిదానంద జ్ఞానబోధన సభలో ఆదివారం మార్గశిర శుద్ధ పౌర్ణమి, దత్తాత్రేయ జయంతి పురస్కరించుకుని విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా 108 కలశాలతో అభిషేకము, అర్చన, దత్త హోమం, మహా పూర్ణాహుతి అత్యంత వైభవంగా నిర్వహించారు. గండిగుంట, పరిసర గ్రామాల ప్రజలు పూజాధికాల్లో పాల్గొన్నారు.





విజయవాడ- మచిలీపట్నం జాతీయ రహదారిపై గండిగుంట వద్ద గ్రామాలకు వెళ్లే సూచికల బోర్డును బ్యానర్‌తో మూసివేత

హైవే సూచికలపై రాజకీయ పైత్యం

● బ్యానర్లతో మూసివేసిన నేతలు ● గమ్యం తెలియక ఇబ్బందులు పడుతున్న వాహన చోదకులు

ఉయ్యూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): హైవేపై సూచికల బోర్డులపై పార్టీల నేతలు బ్యానర్లతో మూసివేసి నెలల తరబడి తొలగించకపోవడంతో చేరాల్సిన గమ్యం తెలియక వాహనాలు నడిపేవారు ప్రమాదాలకు కారకులవుతున్నారు. విజయవాడ- మచిలీపట్నం జాతీయ రహదారిపై గండిగుంట, ఇతర ప్రాంతాల్లో రహదారి నుంచి మరలి సమీపంలో గ్రామాలు, పట్టణాలకు వెళ్లేలా ఆ పరిసరాల్లోని గ్రామాలు, పట్టణాల పేర్లు తెలియచేస్తూ హైవేపై ఏర్పాటుచేసిన బోర్డులపై స్థానిక పార్టీల వారు తమ నేతల పుట్టిన రోజు, ఇతర కార్యక్రమాలకు బ్యానర్లు కట్టి మూసి ఉంచుతున్నారు. అంతేకాక హైవేపైనున్న గ్రామాలవారితో పాటు పొరుగు మండలాల గ్రామాల నేతలూ బ్యానర్లు కడుతున్నారు. ఈ పరిస్థితుల్లో దూర ప్రాంతాలనుంచి కార్లు, ఇతర వాహనాలపై వచ్చేవారికి తాము వెళాల్సిన గమ్యం తెలియక ఫోన్లలో రూట్‌మ్యాప్‌లు చూస్తూ వాహనం నడపుతూ ప్రమాదాలకు కారకులవుతున్నారు. ఇటీవల జాతీయ రహదారిపై ఆకునూరు వద్ద ద్విచక్రవాహనంపై వస్తున్న కానిస్టేబుల్‌ను విజయవాడవైపు నుంచి వస్తున్న కారు ఢీకొనగా కానిస్టేబుల్ అక్కడికక్కడే మృతిచెందాడు. తాను వెళ్లాల్సిన గ్రామానికి దారి తెలియక కారు నడిపే వ్యక్తి రూట్‌మ్యాప్ చూస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి సూచికల బోర్డులపై బ్యానర్లు కట్టకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

దేశానికి భవితనిచ్చేది విద్యే

● కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ

పెనమలూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): దేశానికి భవితనిచ్చేది విద్యేనని, విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన నడవడికతో విద్యనభ్యసించాలని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పేర్కొన్నారు. ఆదివారం కానూరులోని షామ్‌రాక్ ఇంటర్నేషనల్ పాఠశాల 4వ వార్షికోత్సవానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పాఠశాలలో విద్యార్థుల క్రమశిక్షణ చూసి ఆయన అభినందించారు. విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేలా రూపొందించిన విలువలతో కూడిన విద్యా ప్రణాళిక గొప్పతనాన్ని మెచ్చుకొన్నారు. విశిష్ట అతిథిగా హాజరైన ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులకు, ఉపాధ్యాయులకు మధ్య ఉండాల్సిన సానుకూల సంబంధాలు, విద్యార్థులను సరైన మార్గంలో పెట్టడంలో ఉపాధ్యాయుల పాత్ర గురించి వివరించారు. గతేడాది సీబీఎస్సీ బోర్డు పరీక్షల్లో టాప్ మార్కులు సాధించిన విద్యార్థులను, కేంబ్రిడ్జి ప్రైమరీ, సెకండరీ టాప్ పొజిషన్‌లో నిలిచిన విద్యార్థులకు బంగారు పతకాలు అందించారు. అత్యుత్తమ ప్రదర్శనలకు మెమెంటోలను, ప్రశంసా పత్రాలను అందించారు. తర్వాత జరిగిన సాంస్కృతిక ప్రదర్శనలో వింగ్స్ ఆఫ్ ఉమెన్ పేరుతో స్త్రీ శక్తి సామర్థ్యాలను తెలియజేస్తూ చేసిన ప్రదర్శన ప్రేక్షకులను అలరించింది. మండవ ప్రసన్న, వెస్ బెర్రీ, టీ సుమన్ త్యాగరాజు, మోనికా సుమన్, ప్రిన్సిపాల్ డాక్టర్ భారతి పాల్గొన్నారు.



జ్యోతి వెలిగించి వార్షికోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్, కలెక్టర్ డీకే బాలాజీ తదితరులు



డ్రెయిన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బోడె

డ్రెయిన్ పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే బోడె

పెనమలూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.28 లక్షలతో పెనమలూరు ప్రధాన రహదారి వెంబడి పెనమలూరు సెంటరు నుంచి మిఠాయి షాపు వరకు నిర్మించ తలపెట్టిన 300 మీటర్ల పొడవైన డ్రెయిన్ నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఆదివారం శంకుస్థాపన చేశారు. టీడీపీ కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యువతి అనుమానాస్పద మృతి

ఉయ్యూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గండిగుంట వెంకటాపురానికి చెందిన యువతి పట్టపు విజయరాణి (19) ఆదివారం అనుమానస్పద స్థితిలో మృతిచెందింది. ఉయ్యూరు పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం విజయరాణి హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ 5 రోజుల క్రితం వెంకటాపురంలో తల్లిదండ్రుల వద్దకు వచ్చింది. ఆదివారం ఉదయం ఆమె తండ్రి, సోదరుడు కలిసి పనికి వెళ్లగా తల్లి సుజని వేరేపనిపై మచిలీపట్నం వెళ్లి తిరిగి రాగా ఇంటిలోపల ఇనుపరాడ్‌కు తాడుతో ఉరేసుకుని వేలాడుతుండటం గమనించి కిందకు దించగా అప్పటికే మృతి చెందింది. సుజని ఫిర్యాదు మేరకు అనుమానస్పద మృతిగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

అక్రమంగా మద్యం సీసాలు కలిగి ఉన్న వ్యక్తి అరెస్టు

హనుమాన్‌జంక్షన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక గుడివాడ రోడ్డులో పెరికీడు వద్ద బైపాస్ అండర్ బ్రిడ్జి కింద అక్రమంగా మద్యం సీసాలను కలిగి వ్యక్తిని గన్నవరం ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి 6 సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ ఎస్ఐ చందా అల్లూరయ్య తెలిపిన వివరాలు ప్రకారం ఉంగుటూరు మండలం కొయ్యలవారిగూడెం గ్రామానికి చెందిన కాజా సాయితేజ, ఆరు క్వార్టర్ బాటిల్స్‌ను బెల్టుషాపు నిర్వహణకు తీసుకువెళుతున్నట్టు సమాచారం అందడంతో ఎస్సై నిందితుడ్ని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

19న విద్యుత్ అదాలత్ అవగాహన సదస్సు

ఉయ్యూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కన్స్యూమర్స్ గ్రీవెన్సస్ రెడ్రెస్సల్ ఫోరం ఆధ్వర్యంలో ఈనెల 19న విద్యుత్ అదాలత్ అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్టు ఏపీసీపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డి.కృష్ణనాయక్ తెలిపారు. ఉయ్యూరు డివిజన్ పరిధి అవనిగడ్డ రెవెన్యూ కార్యాలయం ప్రాంగణంలో ఉదయం 10-30 నుంచి మధ్యాహ్నం 1-30 గంటల వరకు జరిగే ఈ సదస్సులో సీజే ఆర్ఎఫ్ చైర్మన్ విక్టర్ ఇమ్మానుయేల్, ఫోరం సభ్యులు, విద్యుత్ అధికారులు పాల్గొని వినియోగదారుల సమస్యలు పరిష్కరిస్తారన్నారు.

మహనీయుడు పొట్టి శ్రీరాములు

గన్నవరం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పురుషోత్తపట్నం శాఖా గ్రంథాలయంలో పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ దినోత్సవాన్ని ఘనంగా ఆదివారం నిర్వహించారు. పొట్టి శ్రీ రాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి కె.కృపానందం మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాధన కోసం 56 రోజులు అమరణదీక్ష చేసి తన ప్రాణాలను అర్పించిన మహనీయుడు పొట్టి శ్రీరాములన్నారు. ఆయన ఆదర్శనీయమన్నారు. పలువురు పాఠకులు పాల్గొన్నారు.







పురుషోత్తపట్నం గ్రంథాలయంలో పొట్టి శ్రీరాములు నివాళులర్పిస్తున్న పాఠకులు, బండారుగూడెంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బర్రె లెనిన్, ఝాన్సీ, తదితరులు, జంక్షన్‌లో పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్యవైశ్య సంఘం నేతలు,

శ్రీరాములు త్యాగం చిరస్మరణీయం

హనుమాన్‌జంక్షన్ రూరల్: తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రం కావాలంటూ ఆత్మార్పణ చేసిన పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయమని, ఆయన పోరాట స్ఫూర్తి యువతకు ఆదర్శమని సీపీఎం నేత బర్రె లెనిన్, రాణా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు సుంకర సాంబశివరాయల్ కొనియాడారు. కానుమోలు, బండారుగూడెంలో ఆదివారం పొట్టి శ్రీరాములు వర్ధంతి (ఆత్మార్పణ దినం) నిర్వహించారు. బండారుగూడెంలో మహిళా పోలీస్ ఝాన్సీ సచివాలయ సిబ్బంది పాల్గొని పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పించారు. కానుమోలు గ్రంథాలయాధికారి సుబ్రహ్మణ్యేశ్వరరావు ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పాసర్ల వెంకట సురేష్, సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఆర్యవైశ్య సంఘం ర్యాలీ

హనుమాన్‌జంక్షన్: అమరజీవి పొట్టి శ్రీరాములు 72వ వర్ధంతిని పురస్కరించుకొని ఆదివారం జంక్షన్‌లో బాపులపాడు మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ముందుగా స్థానిక ఏలూరు రోడ్డులోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి పాలాభిషేకం చేసి సంఘం మండలాధ్యక్షుడు కొనకళ్ల రాజశేఖర్ పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం జంక్షన్ 4రోడ్ల కూడలిలో ర్యాలీ నిర్వహించారు. నేతలు చామర్తి రాంబాబు, పైడి సుధాకర్, నారికమల్లి ప్రసాద్, లింగమల్లు రూపాశంకర్, పద్మలలిత, వెచ్చా వెంకటేశ్వరరావు, తిరువీధి వేణుగోపాల్, పాబోలు బదరీనాథ్ పాల్గొన్నారు.

ప్రసాదంపాడులో

ప్రసాదంపాడు: ప్రత్యేకాంధ్ర రాష్ట్ర సాధనకు అమరణ నిరాహారదీక్ష చేసి ప్రాణాలర్పించిన పొట్టి శ్రీరాములు అమరజీవి అయ్యారని ది కిరాణా మార్చంట్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు జూలూరు నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం ప్రసాదంపాడులో పొట్టి శ్రీరాములు 72వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పాదాచారులకు పండ్లు పంపిణీ చేశారు. అన్న సంతర్పణ సమితి ట్రస్ట్ అధ్యక్షుడు గుండు దిలీప్, ఉడత్తు ఆంజనేయులు, వురిమి సుబ్రహ్మణ్యం, ఉడత్తు హరీష్, కుందేపు ఆనందరావు, మాదాల సుబ్బారావు, ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

విజయవాడ వెళ్లిన ఆర్యవైశ్య ప్రముఖులు

పెనమలూరు: విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆదివారం జరిగిన పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమానికి యనమలకుదురు నుంచి ఆర్యవైశ్య సంఘ సభ్యులు తరలివెళ్లారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ హాజరైన ఈ కార్యక్రమానికి చలువాది ప్రసాద్, చిత్తూరు శ్రీనివాసరావు, కిరణ్, బొచ్చు శాంత, కంచర్ల కృష్ణ, సతీష్ హాజరయ్యారు.

కానూరు అశోక్ జిమ్ ఆధ్వర్యంలో..

అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని కానూరు అశోక్ జిమ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక మాతృహృదయ్ సేవా సంస్థ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిమ్ నిర్వాహకులు తాళ్లూరి అశోక్ పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిమ్ క్రీడాకారులు, మాతృహృదయ్ సేవాసభ్యులు పాల్గొన్నారు.

నేటితరానికి అమరజీవి తెలియాలి

కంకిపాడు: అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగాలను నేటితరానికి తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని జనసేన పార్టీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త ముప్పా రాజా అన్నారు. స్థానిక ఆర్యవైశ్య ప్రార్థన మందిరంలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆదివారం ఆయన పూలమాల వేసి నివాళలర్పించారు. జనసేన గ్రామ అధ్యక్షుడు బోయిన నాగరాజు, మండల కార్యదర్శి సుంకర సురేష్, పిచుక రవి, కాంతి, కుంటా గంగాధర్ పాల్గొన్నారు.

ఏజీ అండ్ ఎస్‌జీఎస్ కళాశాల వాకర్స్ ఆధ్వర్యంలో..

ఉయ్యూరు: తెలుగు మాట్లాడే ప్రజలకు ప్రత్యేక రాష్ట్రం కావాలని 56 రోజుల పాటు ఆమరణ దీక్ష చేసి ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములని పలువురు కీర్తించారు. పొట్టి శ్రీరాములు 72వ వర్ధంతి పురస్కరించుకుని ఏజీ అండ్ ఎస్‌జీఎస్ కళాశాల వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం శ్రీరాములు చిత్రపటానికి గౌరవాధ్యక్షుడు నూకల సాంబశివరావు, అధ్యక్షుడు సత్తార్ పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యదర్శి పూర్ణచంద్రరావు, ఆంజనేయులు, బాపిరాజు, హిమకరబాబు ఇతర సభ్యులు నివాళులర్పించారు. ఉయ్యూరు వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శివాలయం రోడ్డు రాము అపార్ట్‌మెంట్ ఆవరణలో శ్రీరాములు చిత్రపటానికి కె.సాంబశివరావు, రాము, తిరుమలరావు, బుజ్జి, రాంబాబు, వూర కిషోర్, వూర నాగిన్, గోపాల్ తదితర సభ్యులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంపీడీవో కార్యాలయం వద్ద శ్రీరాములు చిత్రపటానికి ఎంపీడీవో జీఎస్‌వి శేషగిరిరావు, ఉద్యోగులు, పూలమాలవేసి నివాళులర్పించారు. రిటైర్డ్ ఎంఈవో కేపీ విశ్వమోహన్ పాల్గొని నివాళులర్పించారు.







ప్రసాదంపాడులో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ది కిరాణా మార్చంట్ అసోసియేషన్ సభ్యులు, కంకిపాడులో పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళలర్పిస్తున్న ముప్పా రాజా, ఉయ్యూరులో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	112, 120, 131
చికెన్ విత్ స్కిన్	210
చికెన్ స్కిన్‌లెస్	220
నెక్ కోడిగుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ.630	

నేడు పామర్రు, పెదమద్దాలిలో వీఎం రంగా విగ్రహాల ఆవిష్కరణ

పామర్రు, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): పామర్రు, పెదమద్దాలిలో సోమవారం మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహన రంగా విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని రాధా-రంగా మిత్రమండలి మండల కన్వీనర్ తాడిశెట్టి సాంబ శివరావు ఆదివారం తెలిపారు. రంగా తనయుడు మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ, ఎమ్మెల్యేలు వర్ల కుమార్‌రాజా, బోడె ప్రసాద్, కాగిత కృష్ణప్రసాద్ పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. పామర్రులో తోట రామాలయం వద్ద పాము యూత్ సహకారంతో రాధా-రంగా మిత్రమండలి ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం నాలుగు గంటలకు విగ్రహావిష్కరణ నిర్వహిస్తున్నామన్నారు. మధ్యాహ్నం 3.30గంటలకు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా ఇంటి వద్ద నుంచి పెదమద్దాలి వరకు ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు. రాధా-రంగా అభిమానులు, అన్ని రాజకీయపార్టీల నేతలు పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.


కొండాలమ్మ ఆలయంలో పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్న ఈవో ఎ.కొండలరావు

శాస్త్రోక్తంగా చండీహోమం

గుడ్లవల్లేరు, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): వేమవరం కొండాలమ్మ ఆలయంలో ఆదివారం మార్గశిర పౌర్ణమిని పురస్కరించుకుని శాస్త్రోక్తంగా చండీ హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలను నిర్వహించారు. అమ్మవారిని 20 వేల మంది భక్తులు దర్శించుకున్నారని ఆలయ ఈవో ఎ.కొండలరావు తెలిపారు. చండీహోమంలో కొండలరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. హోమాన్ని ఆలయ ప్రధాన అర్చకుడు శివ సంతోష్‌శర్మ శాస్త్రోక్తంగా జరిపించారు. ప్రతీ నెలా పౌర్ణమిని పురస్కరించుకుని నిర్వహించే చండీహోమం కార్యక్రమానికి రూ.516 చెల్లించి భక్తులు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా పాల్గొనవచ్చని ఆయన సూచించారు.


నీటి సంఘాల కమిటీ సభ్యులను అభినందిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, గిడ్డంగుల సంస్థ రాష్ట్ర చైర్మన్ రావి వెంకటేశ్వరరావు తదితరులు

రాష్ట్రంలో ధర్మబద్ధ పాలన

● ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ, డిసెంబరు15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ధర్మబద్ధ పాలనకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శ్రీకారం చుట్టారని, అందులో భాగంగానే నీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. ఆదివారం రాజేంద్రనగర్‌లోని తన స్వగృహంలో నియోజకవర్గ పరిధిలో నీటి సంఘాల ఎన్నికల్లో విజయం సాధించిన కమిటీల సభ్యులను గిడ్డంగుల సంస్థ రాష్ట్ర చైర్మన్ రావి వెంకటేశ్వరరావుతో కలిసి ఆయన సత్కరించారు. రైతుల అవసరాలను గుర్తించి సమస్యలను పరిష్కరించేలా ముందుకు వెళుతున్నామన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో నీటి సంఘాల ఎన్నికలు నిర్వహించడం ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమన్నారు. రైతులను మోసంచేసి నీటి సంఘాల ఎన్నికల్లో గెలవలేమని తెలిసే వైసీపీ ఎన్నికలను బహిష్కరించినట్లు నాటకమాడిందన్నారు. బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ సురేంద్రబాబు, నాయకులు మురళి, దానేటి సన్యాసిరావు, నీటి సంఘాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మున్సిపల్ మార్కెట్లను ఆధునీకరిస్తా

● వ్యాపారులతో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ చేపలు, మాంసం మార్కెట్లను ఆధునీకరిస్తానని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము హామీ ఇచ్చారు. మీకోసం-మీ వెనిగండ్ల కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ మార్కెట్‌లో ఆయన పర్యటించారు. వ్యాపారులు, కొనుగోలుదారులతో మాట్లాడారు. మార్కెట్‌లో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బస్టాండ్ సెంటర్, కాకర్ల వీధి, బంటుమిల్లి రోడ్డు, శ్రీనివాససెంటర్, మెయిన్‌రోడ్డులో పర్యటించారు. వీరాంజనేయస్వామి దేవస్థానం వద్ద పరిసరాల్లో అపరిశుభ్ర వాతావరణానికి కారణమవుతున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

కోడిపందేల శిబిరంపై దాడి

● ఐదుగురి అరెస్టు..23 బైక్‌లు, రెండు ఆటోలు సీజ్

గుడివాడ రూరల్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): వలివర్తిపాడు పరిధిలో ఆదివారం కోడి పందేల శిబిరంపై పోలీసులు మెరుపు దాడి చేశారు. ఐదుగురిని అదుపులోకి తీసుకున్నామని, వారి నుంచి రూ.5,050 నగదు, రెండు కోళ్లు, 23 మోటారు బైక్‌లు, రెండు ఆటోలు సీజ్ చేసి కేసు నమోదు చేశామని రూరల్ ఎస్‌ఐ చంటిబాబు తెలిపారు.


గుంటూరు బహిరంగసభకు గుడివాడ నుంచి తరలివెళుతున్న మాలమహానాడు నాయకులు

చలో గుంటూరుకు తరలివెళ్లారు

గుడివాడ, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా అఖిల భారత మాల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో గుంటూరులో నిర్వహిస్తున్న భారీ బహిరంగసభకు మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పొంగులేటి జయరాజు ఆధ్వర్యంలో భారీగా తరలివెళ్లారు. ఆదివారం గౌరీశంకరపురంలోని బీఆర్ అంబేడ్కర్ భవన్ నుంచి 20 కార్ల ర్యాలీని పొంగులేటి జెండా ఊపి ప్రారంభించారు. నాయకులు దారం కరుణాకర్, రేమల్లి నీలాకాంత్(పసి), చింతా నాని, బొడ్డు చంటి, పత్తిపాటి బాబి, సాదే విజయకుమార్, బొడ్డు జయరాజు పాల్గొన్నారు. .

నూతన వస్త్రాలు అందజేత

గుడివాడ, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ సమీపిస్తున్న సందర్భంగా ఆదివారం గుడ్‌మెన్‌పేటలోని అవిలాపూరి చిన్నతేరేజమ్మ దేవాలయం(ఆర్సీఎం గుడివాడ-2)లో మాలమహానాడు రాష్ట్ర నాయకుడు మెండా కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో చర్చిలోని క్వయర్ బృందానికి, వృద్ధులకు నూతన వస్త్రాలను విచారణ గురువు ఫాదర్ లూయిస్‌రాజు చేతుల మీదుగా పంపిణీ చేశారు. పదిహేను సంవత్సరాలుగా కిరణ్ అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నారని ఫాదర్ లూయిస్‌రాజు అన్నారు. కంచర్ల సుధాకర్, తోట బెనర్జి, బెజ్జం సువర్ణరాజు, డెక్క భూషణ్ పాల్గొన్నారు.


వీరంకి లాకు వద్ద శిథిలావస్థకు చేరిన సిబ్బంది క్వార్టర్లు, వాటిపై పెరుగుతున్న చెట్లు

శిథిలావస్థలో క్వార్టర్లు

● నివాసయోగ్యంగా లేకపోవడంతో అద్దెకుంటున్న వీరంకి లాకు సిబ్బంది
● తాత్కాలికంగా క్వార్టర్లలోనే కార్యాలయం నిర్వహణ
● మరమ్మతులు చేయించి వినియోగంలోకి తేవాలని కోరుతున్న సిబ్బంది

(ఆంధ్రజ్యోతి-పమిడిముక్కల): మండలంలోని వీరంకి లాకు వద్ద సిబ్బంది కోసం నిర్మించిన క్వార్టర్లు శిథిలావస్థకు చేరాయి. దీంతో సిబ్బంది అందులో నివాసం ఉండడం లేదు. నిర్వహణా లోపంతో కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. వేలాది ఎకరాలకు సాగునీరు, మచిలీపట్నం, పరిసర గ్రామాలకు తాగునీరు సరఫరా చేసే వీరంకి లాకు వద్ద 19మంది లస్కర్లు, ఉద్యోగులు నివాసం ఉండేందుకు కొన్నేళ్ల క్రితం క్వార్టర్లు నిర్మించారు. ఒకప్పుడు క్వార్టర్లలో నివాసం ఉండే వారితో కళకళలాడుతూ ఆప్రాంతమంతా కాలనీలా కన్పించేంది. రానురాను లాకు పరిధిలో ఉద్యోగులు, సిబ్బంది తగ్గిపోవడం, క్వార్టర్ల నిర్వహణ, మరమ్మతులు చేయకపోవడంతో స్లాబులు, గోడలు పగుళ్లిచ్చి కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. ప్రస్తుతం లాకు సూపరింటెండెంట్, ఇద్దరు ఔట్‌సోర్సింగ్ లస్కర్లు ఉన్నారు. క్వార్టర్లన్నీ శిథిలమైపోయాయి. లాకు సూపరింటెండెంట్ కార్యాలయంగా ఉపయోగించేందుకు కూడా అవకాశం లేదు. దీంతో ఎప్పుడు కూలుతుందో తెలియని క్వార్టర్‌లోనే తాత్కాలికంగా కార్యాలయం ఏర్పాటు చేశారు. అందులోనే బిక్కుబిక్కుమంటూ పనిచేస్తున్నారు. క్వార్టర్లు నివాసయోగ్యంగా లేకపోవడంతో బయట అద్దె ఇళ్లలో ఉంటున్నారు. క్వార్టర్స్‌లో నివాసం ఉండకపోయినా జీతం నుంచి అద్దె మినహాయిస్తున్నారని ఉద్యోగులు చెబుతున్నారు.

ఈ క్వార్టర్లలో ఎలా నివాసముంటాం..

శ్లాబులు, గోడలు పగుళ్లిచ్చి కూలేందుకు సిద్ధంగా ఉన్న క్వార్టర్లలో ఎలా నివాసముంటాం. వర్షాలకు శ్లాబు నుంచి నీరు కారుతోంది. గోడలు పగిలి క్వార్టర్లు కూలేలా ఉన్నాయి. కుటుంబసభ్యులతో ఇటువంటి చోట ఎలా నివాస ముం టాం. క్వార్టర్‌లో నివసించకపోయినా జీతం నుంచి అద్దె మినహాయిస్తున్నారు. బయట అద్దె ఇళ్లలో ఉంటూ క్వార్టర్ అద్దె కూడా చెల్లించాల్సి వస్తోంది. క్వార్టర్లకు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తేవాలి.

- ప్రసాద్‌బాబు,
లాకు సూపరింటెండెంట్


గుడివాడలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, గిడ్డంగుల సంస్థ రాష్ట్ర చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ


తోట్లవల్లూరులో పొట్టి శ్రీరాములు, గాంధీ విగ్రహాలకు నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

మహనీయుడు పొట్టి శ్రీరాములు

వర్ధంతి సందర్భంగా ఘన నివాళులర్పించిన ప్రజాప్రతినిధులు, అధికారులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు

గుడివాడ/గుడివాడరూరల్/కూచిపూడి/పామర్రు/పమిడిముక్కల/పెదపారుపూడి/తోట్లవల్లూరు/గుడ్లవల్లేరు, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటు కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు మహనీయుడు అని, ముఖ్యమంత్రి చంద్రబాబు పొట్టి శ్రీరాములు వర్ధంతిని ఆత్మార్పణ దినంగా ప్రకటించడం హర్షణీయమని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. ఆత్మార్పణదినం సందర్భంగా ఆదివారం వాసవీచౌక్‌లోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆర్యవైశ్య సంఘం, కన్యకా పరమేశ్వరి దేవస్థానం, ఆర్యవైశ్య ప్రముఖుడు కొత్త మురళీకృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే వెనిగండ్ల మాట్లాడారు. గిడ్డంగుల సంస్థ రాష్ట్ర చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ పాల్గొన్నారు. గుడివాడ మున్సిపల్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి మున్సిపల్ అకౌంట్స్ అధికారి జి.టి.నాయుడు నివాళులర్పించారు. పురపాలక, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. బీజేపీ గుడివాడ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో వాసవీ చౌక్‌లోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి నాయకులు నివాళులర్పించారు. బీజేపీ పట్టణాధ్యక్షుడు యర్రపోతు అర్జున్, దేవరపల్లి చిన్న, కొత్త కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

మండల పరిషత్ కార్యాలయంలో..

గుడివాడ మండల పరిషత్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ఎంపీపీ గద్దె పుష్పరాణి నివాళులర్పించారు. ఎంపీడీవో డి.వై. విష్ణుప్రసాద్ పాల్గొన్నారు.

మొవ్వ, కూచిపూడిలో..

మొవ్వలో వాసవీ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో చిత్రపటానికి నివాళులర్పించారు. కూచిపూడిలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, సిద్ధేంద్ర కళాపీఠంలో నాట్యాచార్యులు, నాట్య విద్యార్థులు పొట్టి శ్రీరాములు చిత్రపటాలకు నివాళులర్పించారు.

పమిడిముక్కలలో..

ఆర్యవైశ్య సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు యండూరి పిచ్చేశ్వరరావు నివాళులర్పించారు. ఆర్యవైశ్యం సంఘం మండల అధ్యక్షుడు నంబూరి వీరపూర్ణచంద్రరావు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, వాసవీ సేవాదళ్ చైర్మన్ బి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పామర్రులో..

కన్యకాపరమేశ్వరి ఆలయ ప్రాంగణంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అమరజీవి పొట్టిశ్రీరాములు విగ్రహానికి నివాళులర్పించారు. వాసవీ వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు పంచిపెట్టారు. ఆర్యవైశ్య సంఘ నేతలు బి.చంద్రమౌళి, తాళ్లూరి నరేష్, కమలాకర్‌నాథ్, వీరజనార్దనరావు పాల్గొన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ రజనీకాంత్, ఆర్ఐ రాములుతోపాటు వీఆర్వోలు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పించారు.

వెంట్రప్రగడలో..

ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు రవి చంద్రశేఖరరావు ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఎస్ఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పాలాభిషేకం చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పి.శ్రీనివాసరావు, పి.సురేష్, కె.శ్రీనివాసరావు, చలపతి తదితరులు పాల్గొన్నారు.

తోట్లవల్లూరులో..

ఆర్యవైశ్య సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో కన్యకాపరమేశ్వరి ఆలయం వద్ద పొట్టి శ్రీరాములు, మహాత్మగాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘం మండల అధ్యక్షుడు బి.రంగారావు, కార్యదర్శి పి.కాశీవిశ్వేశ్వరరావు, టి.కృష్ణకుమార్, వాసవీ క్లబ్ అధ్యక్షుడు ఎన్.శివన్నారాయణ, కోశాధికారి టి.వెంకటసుబ్బారావు, టి.ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరులో..

లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వార్పు రోడ్డు ఆరంభంలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పించారు. ఆర్యవైస్య సంఘం ప్రతినిధులు కేవీ సుబ్బారావు, కె.మురళి, కె.ప్రభాకరరావు, చిట్టూరి శ్రీను, లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు శశికళ, వైపీసీ ప్రసాద్ పాల్గొన్నారు.


తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులతో చినముత్తేవి హైస్కూల్ 1985-86 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు

అపూర్వ సమ్మేళనం

కూచిపూడి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): చినముత్తేవి జడ్పీ పాఠశాలలో 1985-86 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆ పాఠశాలలో సమ్మేళనం నిర్వహించారు. వీరికి విద్యాబుద్ధులు నేర్పిన ఆనాటి గురువు సుబ్బారావు, వేణుగోపాలరావు, విజయలక్ష్మిని ఘనంగా సత్కరించారు. ఆనాటి అల్లర్లు, ముచ్చట్లు, తీపి కబుర్లు నెమరువేసుకున్నారు. ఆట, పాటలతో పూర్వ విద్యార్థులు సందడి చేశారు. సహపంక్తి భోజనాలు చేశారు. పాఠశాలకు అవసరమైన మైక్‌సెట్, ప్రింటర్, కార్పెట్లు అందించి పాఠశాలతోపాటు గ్రామాభివృద్ధికి తమవంతు సహ కారమందిస్తామని తెలిపారు. గ్రామ ప్రముఖులు కావూరి సూర్య ప్రకాశరావు పాఠశాల అభివృద్ధికి పది వేల ఆర్థిక సహకారం అందించారు. సంకా హరిబాబు, జోగి సురేష్, పోతుల ధనలక్ష్మి, రాజులపాటి వేణుగోపాలరావు ఆధ్వర్యంలో ఈ సమ్మేళనం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.


జిల్లా కోర్టు సెంటర్ నుంచి కోనేరుసెంటరుకు క్రైస్తవుల భారీ ర్యాలీ

ఘనంగా ఐక్య క్రిస్మస్

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఏసుక్రీస్తు బోధించిన ప్రేమ, సేవాతత్పరతను మానవాళి అలవరచుకోవాలని బెరాకా చర్చి అధినేత కిరణ్‌పాల్ అన్నారు. మచిలీపట్నం, పెడన ఐక్య క్రిస్మస్ వేడుకలు బందరులో ఆదివారం ఘనంగా జరిగాయి. జిల్లా కోర్టు సెంటర్ నుంచి కోనేరుసెంటర్ వరకు వేలాది మంది క్రైస్తవులు భారీ ర్యాలీ నిర్వహించారు. సంప్రదాయ సిద్ధంగా ఒంటెలను ఊరేగించారు. క్రైస్తవ గీతాలు గానం చేస్తూ సాగిన ఈ ర్యాలీ లో మత పెద్దలతో పాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు. కోనేరుసెంటర్‌లో జరిగిన సభా కార్యక్రమాలలో మత పెద్దలు ప్రసంగించారు. ఏసుక్రీస్తు జననం ఒక అద్భుతమన్నారు.

పైడమ్మ ఆలయ ప్రవేశం



పెడన, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : రంగుల అలంకరణ కోసం మచిలీపట్నం వెళ్లిన పైడమ్మ రంగుల అలంకరణ పూర్తి చేసుకుని శనివారం ఉదయం ఊరేగింపుగా బయలుదేరి ఆదివారం తెల్లవారుజామున కాపులవీధిలోని కృష్టమ్మ బావి వద్దకు చేరుకుంది. బావి దగ్గర అత్తింటి దాసు వంశీయులు నైవేద్యం సమర్పించగా ఘటం గుడి వద్ద తోటవారు నైవేద్యం సమర్పించారు. పుట్టింటి వారైన తోట వంశీయులు కృష్ణమ్మ బావి దగ్గర అమ్మవారికి పూజలు జరిపారు. అనంతరం ఆమె ఆదివారం ఊరేగింపుగా బయలుదేరి కొత్తపేటలోని ఆలయానికి చేరుకున్నారు. ఈవో టి.వి.వి. మోహనరావు, వ్యవస్థాపక ధర్మకర్త తోట రామారావు, ఉత్సవ కమిటీ సభ్యులు ఘనస్వాగతం పలికారు. ఆదివారం ఉదయం 10 గంటలకు పైడమ్మ ఆలయ ప్రవేశం చేశారు. జాతర ఉత్సవాలు ఆదివారం రెండో రోజుకు చేరాయి. కాపు సామాజిక వర్గీయులు ఆదివారం పట్టణంలో శిడిబండ్లను అంగ రంగ వైభవంగా ఊరేగించారు. కాపులవీధి నుంచి బయలుదేరిన ఈ ఊరేగింపు ప్రధాన రహదారుల మీదుగా కొత్తపేటలోని పైడమ్మ ఆలయానికి చేరుకుంది.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	112, 120, 131
చికెన్ విత్ స్కిన్	210
చికెన్ స్కిన్‌లెస్	220

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.630

పాతకక్షలతో దాడి : ముగ్గురికి గాయాలు



పెడన, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : పాతకక్షల కారణంగా పట్టణంలోని గూడూరు రైల్వేగేటు సమీపంలో ఆదివారం జరిగిన దాడి ఘటనలో ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. గూడూరు మండలం ఆకులమన్నాడుకు చెందిన జిలానీ అలియాస్ గంగాధర్, చినఆకులమన్నాడుకు చెందిన దగాని శివలపై కప్పలదొడ్డికి చెందిన పేరిశెట్టి చరణ్ బ్లేడుతో దాడి చేశాడు. ఈ దాడిలో జిలానీ, శివలకు మెడపై తీవ్ర గాయాలయ్యాయి. చరణ్ కూడా గాయపడ్డాడు. ఈ ముగ్గురినీ పోలీసులు బందరు ప్రభుత్వ ఆసుపత్రికి పంపారు.



విజేత బేగ్ లెవన్ జట్టుకు రూ.30 వేల నగదు అందజేస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర తనయుడు పునీత్

కొల్లు ఫౌండేషన్ క్రికెట్ టోర్నీ విజేత బేగ్ లెవన్

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : యువతలోని నైపుణ్యాలను వెలికి తీసేందుకు క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు మంత్రి కొల్లు రవీంద్ర తనయుడు కొల్లు పునీత్ అన్నారు. కొల్లు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నోబుల్ కళాశాల క్రీడా ప్రాంగణంలో గత 17 రోజులుగా జరుగుతున్న క్రికెట్ పోటీలు ఆదివారంతో ముగిసాయి. ఫైనల్ మ్యాచ్‌లో హకీం 11 జట్టు, బేగ్ లెవెన్ జట్టు మధ్య గట్టి పోటీ జరిగింది. బేగ్‌లెవెన్ టీమ్ 59 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. బేగ్‌లెవెన్ టీమ్‌కు రూ. 30వేల నగదు బహుమతిని కొల్లు పునీత్ అందించారు. ఉండి ఎమ్మెల్యే మంతెన రామరాజు, రాష్ట్ర తెలుగుయువత ఉపాధ్యక్షుడు హకీంబేగ్, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండి రామకృష్ణ, తెలుగురైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ, లంకే నారాయణ ప్రసాద్, గడ్డం రాజు, టీడీపీ నాయకుడు లంకే శేషగిరి, పార్వతి తదితరులు పాల్గొన్నారు.



రామకృష్ణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, పరిశీలకుడు కనపర్తి

రామకృష్ణ మృతి తీరని లోటు : మండలి

మోపిదేవి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మోపిదేవి గ్రామ టీడీపీ అధ్యక్షుడు కావూరి రామకృష్ణ అకాల మృతి పార్టీకి తీరని లోటని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, నియోజకవర్గ టీడీపీ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు అన్నారు. రావివారిపాలెంలోని ఆయన స్వగృహం వద్ద ఆదివారం సంతాప సభ జరిగింది. పార్టీ నాయకులు రామకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రావి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జనసేన నాయకులు మండలి వెంకట్రామ్, జడ్పీటీసీ సభ్యుడు మెడబలిమి మల్లిఖార్జునరావు, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు నడకుదుటి జనార్ధనరావు, పార్టీ నాయకులు కొల్లూరి వెంకటేశ్వరరావు, నాదెళ్ల శరత్ చంద్రబాబు, పైడిపాముల కృష్ణకుమారి, దిడ్ల జానకి రాం బాబు, రావి రత్నగిరి, వేములపల్లి పిచ్చేశ్వరరావు, తుమ్మల చౌదరిబాబు, డొకిపర్తి బాల కోటేశ్వరరావు, మేడికొండ విజయ్, కొలుసు శివ రాజేష్, హేమంత్ తదితరులు ఉన్నారు.



విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందజేస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

బొండాడ సేవలు అభినందనీయం

అవనిగడ్డ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : బొండాడ ఇంజనీరింగ్ లిమిటెడ్ ఛైర్మన్ బొండాడ రాఘవేంద్రరావు సేవా కార్యక్రమాలు అభినందనీయమని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. రాయల్ సర్వీస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు ఉపకార వేతనాలను ఆదివారం పంపిణీ చేశారు. రాయల్ సర్వీస్ ట్రస్ట్ ఛైర్మన్ సీతాళం రాంబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో 62 మంది విద్యార్థులకు రూ.4.60 లక్షల నగదు ఉపకార వేతనాలుగా అందించారు. ఎంఈవో టి.వి.ఎం.రామదాసు, రాయల్ సర్వీస్ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి తోట పద్మనాభరావు, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా ఛైర్మన్ తోట శ్రీరంగ సత్యబాలాజీ, ట్రస్ట్ కోశాధికారి అంకెం రామసాయి, ఈమని దామోదర్ తదితరులు పాల్గొన్నారు.



మున్సిపాల్టీ కొనుగోలు చేసిన ట్రాక్టర్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, ఛైర్‌పర్సన్ కటకం నాగకుమారి

పెడన మున్సిపాల్టీకి కొత్త ట్రాక్టర్లు

పెడన, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : చెత్త సేకరణ కోసం రూ. 25 లక్షలు 15వ ఆర్థిక సంఘం నిధులతో పెడన మునిసిపాలిటీ కొనుగోలు చేసిన రెండు ట్రాక్టర్లు, 25 పుష్‌కార్ట్‌లను ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ ఆదివారం ప్రారంభించారు. ఛైర్‌పర్సన్ కటకం నాగకుమారి, కమిషనర్ ఎం. గోపాలరావు, జడ్పీటీసీ సభ్యుడు అర్జా వెంకటనగేష్, పట్టణ టీడీపీ అధ్యక్షుడు యక్కల శ్యామలయ్య, కౌన్సిలర్ కటకం ప్రసాద్, మాజీ కౌన్సిలర్ బెజవాడ నాగరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ హరికిషోర్ పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ధన్వంతరీ ఆచార్య

బాల్యం నుంచి భగవద్గీత నేర్పాలి

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు బాల్యం నుంచి భగవద్గీత నేర్పాలని డాక్టర్ బి. ధన్వంతరీ ఆచార్య అన్నారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో బాలాజీ విద్యాలయంలో విద్యార్థులకు ఆదివారం భగవద్గీత శ్లోకాల పోటీ జరిగింది. విజేతలకు డాక్టర్ బి. ధన్వంతరీ ఆచార్య, డాక్టర్ ఉడత్తు శ్రీనివాసరావు, న్యాయవాది కూనపరెడ్డి శ్రీనివాస్, తురగా ప్రసాద్ తదితరులు బహుమతులు అందజేశారు. నాలుగు విభాగాలుగా జరిగిన పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తురగా ప్రసాద్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయం

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిదని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. వర్ధంతి సందర్భంగా ఆదివారం జిల్లా కోర్టుసెంటర్‌లోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి మంత్రి కొల్లు రవీంద్ర, మాజీ ఎంపీ, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్పీ ఆర్. గంగాధరరావు, తెలుగురైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ, ఇంటర్ బోర్డు జిల్లా అధికారి సాల్మన్ రాజు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బూరగడ్డ అశోక్‌కుమార్, కార్యదర్శి సిద్ధినేని సాయిబాబు తదితరులు కూడా పొట్టి శ్రీరాములుకు నివాళులర్పించారు. **పెడన:** పాత కూరగాయల మార్కెట్ సెంటర్‌లోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కమిషనర్ ఎం. గోపాలరావు, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొల్లూరి చిన్నా తదితరులు పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆత్మకూరి సురేష్, కొల్లూరి చంటి పాల్గొన్నారు. **బంటుమిల్లి :** బంటుమిల్లిలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి తహసీల్దార్ భరత్ రెడ్డి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ శంకర్, ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. **అవనిగడ్డ రూరల్ :** మండల పరిషత్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ఎంపీపీ తుంగల సుమతి దేవి నివాళులర్పించారు. ఈవోపీఆర్డీ అరుణకుమారి, కో-ఆప్షన్ సభ్యుడు నజీర్‌బాషా, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. **ఘంటసాల :** యూవీఆర్ గొర్రెపాటి స్కూల్‌లో పొట్టి శ్రీరాములు వర్ధంతి నిర్వహించారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కరస్పాండెంట్ గొర్రెపాటి వెంకట రామకృష్ణ, గొర్రెపాటి ఫౌండేషన్ సభ్యులు కొండపల్లి రామకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ వడ్లమూడి మంజూష, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. చిట్టూర్పులో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి సర్పంచ్ గూడపాటి వెంకటేశ్వరరావు, కార్యదర్శి శ్రీ లక్ష్మి కృష్ణవేణి నివాళులర్పించారు. కృషి విజ్ఞాన కేంద్రంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు పొట్టిశ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పించారు. ఘంటసాల గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద సిబ్బంది పొట్టి శ్రీరాములు వర్ధంతిని నిర్వహించారు. **నాగాయలంక :** ఆర్యవైశ్య కళ్యాణ మండపం వద్ద పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆర్యవైశ్య సంఘం నేతలు నివాళులర్పించారు. డాక్టర్ బాసు ప్రతాప్, ఇరిగేషన్ ఏఈ పొన్నూరు రవితేజ, చిట్టా సాంబశివరావు, చిట్టా వీర అన్నపూర్ణయ్య, తాడికొండ సత్యనారాయణ, వంకాయల రాజేష్, చిట్టా శేఖర్, వి.హరీష్, తూనుగుంట్ల శేషు, తదితరులు పాల్గొన్నారు. **అవనిగడ్డ :** మండల ఆర్యవైశ్య సంఘ నేతలు పొట్టి శ్రీరాములు వర్ధంతి జరిపారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, ఆయన కుమారుడు మండలి వెంకట్రామ్, కూటమి నేతలు యాసం చిట్టిబాబు, నడకుదుటి జనార్ధనరావు, ఘంటసాల రాజమోహనరావు, సిద్ధినేని అశోక్ నాయుడు, పూతబోయిన సీతారత్న సాయిబాబు, కాగిత రామారావు, మొగల్ మురాద్ బేగ్ తదితరులు పాల్గొన్నారు. **చల్లపల్లి :** అమరజీవి పొట్టి శ్రీరాములు 72వ వర్ధంతి శ్రీఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యం లో నిర్వహించారు. కల్యాణ మండపంలోని పొట్టిశ్రీరా ములు విగ్రహానికి నేతలు పూలమాలలు వేసి నివాళులు అర్పిం చారు. సంఘ కార్యదర్శి వరదా హరిగోపాల్, కోశాధికారి తమ్మన సతీష్‌కుమార్, కొల్లిపర సాంబశివరావు, మెహర్, కిరణ్, సురేష్, తమ్మన ప్రసాద్, చైతన్య, చుండూరు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి రవీంద్ర, బార్ నాయకులు, ఎమ్మెల్యే బుద్ధప్రసాద్



పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాగిత

వాసవీక్లబ్ ఆధ్వర్యంలో నేత్ర పరీక్షా శిబిరం

చల్లపల్లి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : చల్లపల్లి వాసవీక్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత నేత్ర పరీక్షా శిబిరం జరిగింది. డాక్టర్ మోహన్‌రావు 50 మందిని పరీక్షించి 17 మందిని ఐవోఎల్ శస్త్రచికిత్సలకు ఎంపికచేశారు. వీరికి అమరావతి హాస్పటల్‌లో ఆపరేషన్ చేయనున్నారు. క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు మాజేటి అమరవాణి, గోళ్ల వెంకటరత్నం, కోశాధికారి మంచికంటి కిరణ్, దింటకుర్తి జ్యోతి, దేసు జయలక్ష్మి, చైతన్య, కుసుమ, మలిశెట్టి చెంచురా ములు తదితరులు శిబిరాన్ని పర్యవేక్షించి సేవలందించారు. విజయవాడకు చెందిన నందిపాటి సుబ్బారావు, శ్రీధర్ కుటుంబ సభ్యుల సహకారంతో శిబిరం నిర్వహించారు.

తూమాటి రంగనాథ్‌కు నివాళి

అవనిగడ్డ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : అవనిగడ్డలో న్యాయవాదిగా పని చేస్తూ మూడు దశాబ్దాల క్రితం హత్యకు గురైన తూమాటి రంగనాథ్ వర్ధంతిని ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. కోర్టు సమీపంలోని తూమాటి రంగనాథ్ స్థూపం వద్ద ఆయన అభిమానులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తూమాటి లక్ష్మణరావు, కొల్లూరి వెంకటేశ్వరరావు, పరుచూరి దుర్గాప్రసాద్, సింహాద్రి రామనాథం, సామర్ల రాముడు, న్యాయవాది పరుచూరి రాఘవేంద్రరావు, టీడీపీ తూమాటి ప్రసాద్, యక్కటి చిన్న మస్తాన్, నలుకుర్తి ఏసుబాబు, పరుచూరి రఘునాథం తదితరులు పాల్గొన్నారు.



ఐక్య క్రిస్మస్ ర్యాలీలో బెరాకా చర్చి అధినేత కిరణ్‌పాల్



నిరుపేదలకు నిత్యావసర సరుకులు, దుస్తులు అందజేస్తున్న వేములపల్లి సురేష్

ప్రేమ, సేవాతత్పరత అలవర్చుకోవాలి

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఏసుక్రీస్తు బోధించిన ప్రేమ, సేవాతత్పరతను మానవాళి అలవరచుకోవాలని బెరాకా చర్చి అధినేత కిరణ్‌పాల్ అన్నారు. మచిలీపట్నం, పెడన ఐక్య క్రిస్మస్ వేడుకలు బందరులో ఆదివారం ఘనంగా జరిగాయి. జిల్లా కోర్టు సెంటర్ నుంచి కోనేరుసెంటర్ వరకు వేలాది మంది క్రైస్తవులు భారీ ర్యాలీ నిర్వహించారు. సంప్రదాయ సిద్ధంగా ఒంటెలను ఊరేగించారు. క్రైస్తవ గీతాలు గానం చేస్తూ సాగిన ఈ ర్యాలీలో మత పెద్దలతో పాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు. కోనేరుసెంటర్‌లో జరిగిన సభా కార్యక్రమాలలో మత పెద్దలు ప్రసంగించారు. ఏసుక్రీస్తు జననం ఒక అద్భుతమన్నారు. బాధితులను రక్షించేందుకే ఏసుక్రీస్తు జన్మించాడన్నారు. చర్చిలలో స్టార్లు, ఏసుక్రీస్తు జననం సెట్టింగులు అమర్చారు.



ఆర్‌సీఎం చర్చిలో క్రీస్తు జననం నాటిక ప్రదర్శన

నిరుపేదల జీవితాల్లో క్రిస్మస్ వెలుగులు నింపాలి

చల్లపల్లి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : నిరుపేదల జీవితాల్లో క్రిస్మస్ వెలుగులు నింపాలని ఐవీఎం స్వచ్ఛంద సేవాసంస్థ డైరెక్టర్ డాక్టర్ వేములపల్లి సురేష్ అన్నారు. పురిటిగడ్డ ఐవీఎం కార్యాలయంలో సెమీక్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. పలు గ్రామాలకు చెందిన 102 మంది వితంతువులు, పేదలకు ఐవీఎం ఆధ్వర్యంలో రూ.1.30 లక్షల విలువైన నిత్యావసర సరుకులు, వస్త్రాలను అందచేశారు. సంస్థ ప్రతినిధులు వేముపల్లి రోజా, విజయ పాల్గొన్నారు.

పైడమ్మ ఆలయ ప్రవేశం



పెడన, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : జాతర ఉత్సవాలను పురస్కరించుకుని రంగుల అలంకరణ కోసం మచిలీపట్నం వెళ్లిన పైడమ్మ రంగుల అలంకరణ పూర్తి చేసుకుని శనివారం ఉదయం ఊరేగింపుగా బయలుదేరి ఆదివారం తెల్లవారుజామున కాపులవీధిలోని కృష్ణమ్మ బావి వద్దకు చేరుకుంది. బావి దగ్గర అత్తింటి దాసు వంశీయులు నైవేద్యం సమర్పించగా ఘటం గుడి వద్ద తోటవారు నైవేద్యం సమర్పించారు. పుట్టింటి వారైన తోట వంశీయులు కృష్ణమ్మ బావి దగ్గర అమ్మవారికి పూజలు జరిపారు. అనంతరం ఆ మె ఆదివారం ఊరేగింపుగా బయలుదేరి కొత్తపేటలోని ఆలయానికి చేరుకున్నారు. ఈవో టి.వి.వి. మోహనరావు, వ్యవస్థాపక ధర్మకర్త తోట రామారావు, ఉత్సవ కమిటీ సభ్యులు బొడ్డు ఆనందరావు, మల్లంపల్లి శ్రీనివాసరావు, పత్తిపాటి జయకృష్ణ, కోమట్ల సాంబశివరావు, కోరుమిల్లి వెంకటస్వామి, బొల్లా రామచంద్రరావు తదితరులు ఘనస్వాగతం పలికారు. ఆదివారం ఉదయం 10 గంటల సమయంలో పైడమ్మతల్లి ఆలయ ప్రవేశం చేశారు. జాతర ఉత్సవాలు ఆదివారం రెండో రోజుకు చేరాయి. రెండో రోజు ఆదివారం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. కాపు సామాజిక వర్గీయులు ఆదివారం పట్టణంలో శిడిబండ్లను అం గరంగ వైభవంగా ఊరేగించారు. పట్టణంలోని కాపులవీధి నుంచి బయలుదేరిన ఈ ఊరేగింపు ప్రధాన రహదారుల మీదుగా కొత్తపేటలోని పైడమ్మ ఆలయానికి చేరుకుంది.



మంత్రి రవీంద్రను పరామర్శిస్తున్న లకనం, నారాయణప్రసాద్, రామమోహనరావు

మంత్రి కొల్లు రవీంద్రకు మత్స్యకార నేతల పరామర్శ

నాగాయలంక, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : సోదరుడు కొల్లు వెంకట రమణను కోల్పోయిన మంత్రి కొల్లు రవీంద్రను ఆదివారం మచిలీపట్నంలో నాగాయలంకకు చెందిన ఆంధ్రప్రదేశ్ సంప్రదాయ మత్స్యకారుల సేవా సమితి ప్రధాన కార్యదర్శి లకనం నాగాంజనేయులు, మత్స్యకారుల సహకార సంఘం మాజీ అధ్యక్షుడు లంకే నారాయణ ప్రసాద్, బొడ్డు రామమోహనరావు పరామర్శించారు. వెంకటరమణ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.



సముద్ర స్నానం చేసేటప్పుడు జాగ్రత్త వహించాలి

కోడూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : హంసలదీవి బీచ్ వద్ద సముద్ర స్నానం చేసేటప్పుడు పర్యాటకులు జాగ్రత్త వహించాలని మెరైన్ సీఐ సురేష్ రెడ్డి తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి ఆదివారం హంసలదీవి బీచ్‌కు వచ్చిన పర్యా టకులకు మెరైన్ సిబ్బంది తగు సూచనలు, సలహాలు అందించారు. సముద్రతీరం వెంబడి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా మెరైన్, పోలీసు సిబ్బంది గస్తీ నిర్వహించారు.



ఈశ్వర్ అకాడమీ విద్యార్థులకు బుద్ధప్రసాద్ అభినందన

అవనిగడ్డ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రాచీన గ్రామీణ క్రీడల్లో ఒక్కటైన కర్రసాముకు పునరుత్తేజం కలిగించేలా ఈశ్వర్ అకాడమీ చేస్తున్న కృషి అభినందనీయమని ఎమ్మె ల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. నెల్లూరులో జరిగిన జాతీయ కర్రసాము పోటీల్లో అవనిగడ్డ ఈశ్వర్ డ్యాన్స్ అండ్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ విద్యార్థులు 42 బంగారు పతకాలు సాధించారు. విద్యార్థులను బుద్ధప్రసాద్ అభినందించారు. మాస్టర్ ఈశ్వర్, కృష్ణ జిల్లా కర్రసాము సెక్రటరీ విశ్వ కోచ్ టిఆర్ఎన్.ఆనంద్‌లను ఆయన అభినందించారు. ఎమ్మెల్యే కుమారుడు మండలి వెంకట్రామ్, పీఈటీలు ఫణి, మారుతి పాల్గొన్నారు.

రైతు ప్రయోజనాలకు పెద్దపీట వేయాలి

అవనిగడ్డ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రైతు ప్రయోజనాలు కాపాడటమే ధ్యేయంగా పని చేయాలని, ప్రతి ఎకరాకు సాగునీరు అందించే లక్ష్యంగా పని చేయాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు సూచించారు. గాంధీక్షేత్రంలో ఆదివారం సాగునీటి సంఘాల పాలకవర్గాలను అభినందించారు. మెడబలిమి మల్లిఖార్జునరావు, పరుచూరి సుభాష్ చంద్రబోస్, నడకుదుటి జనార్ధనరావు, తుమ్మల చౌదరిబాబు, మెండు లక్ష్మణరావు, గుడివాక శేషుబాబు, రత్నగోపాల్, కొల్లూరి వెంకటేశ్వరరావు, భానుప్రకాష్, దిలీప్ కుమార్, కృష్ణకుమారి, బండే రాఘవ, యార్లగడ్డ శ్రీనివాసరావు, లుక్కా వెంకట పిచ్చియ్య, సీతారామాంజనేయులు పాల్గొన్నారు.

సూర్యనారాయణస్వామి శాంతి కల్యాణం

అవనిగడ్డ రూరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : వేకనూరులో సూర్యనారాయణ స్వామి శాంతి కల్యాణం రాజశేఖర శర్మ బ్రహ్మత్వంలో సనకా శ్రీనివాసరావు - ఉదయలక్ష్మి దంపతులు జరిపించారు. కాకర్ల సాయి హర్షిత్, సీతామహాలక్ష్మి, అనిత ఆర్థిక సహాయంతో అన్నదానం చేశారు. ధర్మకర్త తుంగల వీరవసంతరావు - ఇందిరా దంపతులు పర్యవేక్షించారు.

రాజగోపుర నిర్మాణ పనులు ప్రారంభం

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : బందరుకోటలోని కోదండ రామాలయం రాజగోపుర నిర్మాణ పనులను చేపట్టారు. మంత్రి కొల్లు రవీంద్ర ఆధ్వర్యంలో దేవాలయాన్ని గతంలో నిర్మించారు. దేవాలయానికి గాలి గోపురం నిర్మాణ పనులను శిల్పులు, వాను సిద్ధాంతులు పర్యవేక్షించారు.

మాలల గర్జనకు తరలివెళ్లిన నేతలు

అవనిగడ్డ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ, క్రిమిలేయర్ అనుకూల తీర్పును వ్యతిరేకిస్తూ అఖిల భారత మాలసంఘాల జేఏసీ పిలుపు మేరకు హలో మాల చలో గుంటూరు కార్యక్రమానికి అవనిగడ్డ నియోజవకర్గం నుంచి పెద్ద ఎత్తున తరలివెళ్లారు. మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు దోవా గోవర్ధన్, జై భీమ్ భారత్ పార్టీ నేత సముద్రాల అంబేడ్కర్, జేఏసీ నేతలు కర్రా సుధాకర్, నీలా మనోహర్, నీలా వెంకటేశ్వరరావు, లింగం అనిల్, దోవారి కుటుంబరావు, కైలే రమేష్, నీలా రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు. **గూడూరు :** ఆకుమర్రు గ్రామం నుంచి రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు కారుమంచి కామేశ్వరరావు ఆధ్వర్యంలో సుమారు 500 మంది గుంటూరు తరలివెళ్లారు. **నాగాయలంక :** సుప్రీం కోర్టు ఇచ్చిన ఎస్సీ వర్గీకరణ తీర్పును నిరసిస్తూ ఆదివారం గుంటూరులో జరిగిన మాలల మహాసభకు మండలంలోని పలువురు మాలలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. ఎస్సీ సంఘం నేత మంచాల తిరుపతి వరప్రసాద్ నేతృత్వంలో తరలివెళ్లారు.